# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 30-7-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 సంపుటి :29 సంచిక: 277 పేజీలు:6 వెల: రూ.1/-


## పర్యావరణ రక్షణకు పెద్ద పులి పాత్ర అత్యంత కీలకం

**-పులులను మనం కాపాడితే, అవి అడవిని తద్వారా మనల్ని కాపాడుతాయి**

**-ఫారెస్ట్ కాలేజీలో ఘనంగా ప్రపంచ పెద్ద పులుల దినోత్సవం**

**-అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్.ఎం. డోబ్రియల్**

హైదరాబాద్ జూలై 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి కార్యక్రమం హైదరాబాద్ (ములుగు) ఫారెస్ట్ కాలేజీ, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ లో




ఘనంగా జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా మారిన వాతావరణ పరిస్థితులు, పర్యావరణ రక్షణకు ముప్పుగా మారాయని, ఉన్న అడవుల సంరక్షణ మాత్రమే దీనికి అనువైన పరిష్కారమని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్ & హెచ్ఓఎఫ్ఎఫ్) ఆర్.ఎం. డోబ్రియల్ అన్నారు. అడవుల రక్షణకు పులుల ప్రాధాన్యతే కీలకం అని, పులులను మనం కాపాడితే, అవి అడవినీ, తద్వారా ప్రజలను కాపాడుతాయని అన్నారు. ఈ విషయం ప్రతీ ఒక్కరూ గ్రహించి, ఇతరులనూ చైతన్యవంతం చేయాలన్నారు. ప్రాజెక్ట్ టైగర్ కార్యక్రమం ద్వారా దేశ వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమాలు పులుల సంఖ్య పెరిగేందుకు దోహద పడ్డాయని, ప్రస్తుతం దేశంలో 3,167 పులులు ఉన్నాయని తెలిపారు. అడవికి రాజులా పులి వ్యవహార శైలి, ప్రవర్తన గురించి ఆసక్తికరమైన విషయాలను ఈ సందర్భంగా పీసీసీఎఫ్ వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యతతో అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వుల్లో తీసుకున్న సంరక్షణ చర్యల వల్ల పులుల సంఖ్య బాగా పెరిగిందని, రానున్న రోజుల్లో మరింతగా పులుల ఆవాసాలను అభివృద్ధి చేస్తామన్నారు. అటవీ ప్రభావిత గ్రామాల పరిసరాల్లో జంతువులు, మనుషుల మధ్య సంఘర్షణ నివారణకు కృషి చేస్తున్నామన్నారు. పులుల ఆవాసాల్లో అలజడిని తగ్గించేందుకు కోర్ ఏరియాల్లో ఉన్న గ్రామాల తరలింపు ప్రక్రియను చేపట్టామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయం మేరకు భవిష్యత్ పర్యావరణవేత్తలను తీర్చిదిద్దుతున్న ఫారెస్ట్ కాలేజీ, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ లో రాష్ట్ర స్థాయి టైగర్ డే నిర్వహించటం శుభ పరిణామని డీన్ ప్రియాంక వర్గీస్ అన్నారు. అటవీ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ కార్యక్రమం అత్యంత ఉపయోగకరం అని అన్నారు. రాష్ట్ర స్థాయి అటవీ అధికారులు, ఉద్యోగులు, ఫారెస్ట్ కాలేజీ, ఫారెస్ట్ అకాడమి (దూలపల్లి) నుంచి ట్రెయినీలు మొత్తం నాలుగు వందల మంది టైగర్ డే ఉత్సవాల్లో పాల్గొన్నారు. టైగర్ థీమ్ గా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులు, ఉద్యోగులకు బహుమతులను అందించారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వుల అభివృద్ధి, పురోగతిపై ఫీల్డ్ డైరెక్టర్లు వినోద్ కుమార్, క్షితిజలు కార్యక్రమంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. పులుల రక్షణ కోసం అటవీశాఖ తీసుకుంటున్న చర్యలపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఫారెస్ట్ కాలేజీలో కొత్తగా ప్రారంభిస్తున్న ఎం.ఎస్సీ (వైల్డ్ లైఫ్) బ్రోచర్ ను కార్యక్రమంలో ఆవిష్కరించారు. హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ తరపున ఇమ్రాన్ సిద్దికీ తాము పులుల సంరక్షణ కోసం చేస్తున్న పనులను సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో పీసీసీఎఫ్ (విజిలెన్స్) ఏలూసింగ్ మేరు, అడిషనల్ పీసీసీఎఫ్ (ఐ.టీ) వినయ్ కుమార్, సీసీఎఫ్ రామలింగం, హైదరాబాద్ సీసీఎఫ్ సైదులు, ఫారెస్ట్ అకాడెమి డైరెక్టర్ ఆశ, ఫారెస్ట్ కాలేజీ అధికారులు శ్రీనివాస రావు, వెంకటేశ్వర్లు, నర్సింహారెడ్డి, తదితరులు హాజరయ్యారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు.. ఆరుగురు మావోయిస్టులు మృతి..?

హైదరాబాద్, జులై 29:ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో శనివారం పోలీసులు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు సంభవించాయి. ఈ కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెంది ఉండొచ్చు.. లేదా గాయాలపాలై ఉండొచ్చని పోలీసు అధికారులు పేర్కొన్నారు. కానీ ఇప్పటి వరకు మృతదేహాలు లభ్యం కాలేదన్నారు.

చింతగుఫా, కిస్టారం పోలీసు స్టేషన్ పరిధిలోని చోటేకేద్వాల్ గ్రామ సమీపంలోని అడవుల్లో మావోయిస్టులు ఉన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. డివిజనల్ కమిటీ మెంబర్, కిస్టారం ఏరియా కమిటీ ఇంచార్జి రాజుతో పాటు 30 నుంచి 35 మంది మావోయిస్టులు సమావేశమైనట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో అక్కడ పోలీసులు కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. దీంతో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య గంట పాటు ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎదురుకాల్పుల్లో నలుగురి నుంచి ఆరుగురు మావోయిస్టులు మృతి చెంది ఉండొచ్చు. లేదా గాయపడి ఉండొచ్చు అని పోలీసులు పేర్కొన్నారు. అయితే వారిని మావోయిస్టులు అడవుల్లోకి లాక్కెళ్లి ఉండొచ్చని, ఆచూకీ కోసం కూంబింగ్ కొనసాగుతుందని పోలీసులు తెలిపారు.

## భారీ వర్షాల కారణంగా మున్నేరు బ్రిడ్జి మూసివేత



ఎన్టీఆర్ జిల్లా జూలై 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: భారీ వర్షాల కారణంగా తెలుగు రాష్ట్రాల్లో నదులు, కాలువలు, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ప్రస్తుతం వానలు తగ్గుముఖం పట్టినా ప్రవాహం ఏ మాత్రం తగ్గలేదు. దీంతో విజయవాడ-హైదరాబాద్ రహదారిపై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రెండు, మూడు రోజులుగా భారీ ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ప్రవాహం తగ్గుతుందేమోనని ఆశించారు గానీ ప్రస్తుతం ఆ పరిస్థితులు కనిపించడం లేదు. పైగా భారీ వరదల కారణంగా మున్నేరు బ్రిడ్జి పూర్తిగా దెబ్బతింది. దీంతో వత్సవాయి మండలం పరిధిలోని లింగాల గ్రామం దగ్గర ఉన్న మున్నేరు బ్రిడ్జిని అధికారులు మూసివేశారు. మరోవైపు వత్సవాయి-జగ్గయ్యపేట రూట్లో రాకపోకలు నిలిచిపోయాయి. వత్సవాయి మండలంలోకి వెళ్లేందుకు పెనుగంచిప్రోలు మండలం మీదగా వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు.

## నేరడలో ఘనంగా మొహరం పీర్ల పండుగ





ఖమ్మం, జులై 29: (నేటినిజం ప్రతినిధి): త్యాగానికి ప్రతిరూపమైన ఇమామ్ హస్సన్, హుస్సేన్ బలిదాన గుర్తుచేసుకుంటూ నేరేడలో ఘనంగా పీర్ల పండగ నిర్వహించారు. ఖమ్మంజిల్లా చింతకాని మండలంలోని నేరేడ గ్రామంలో మొహరం పండుగ చాలా ఘనంగా నిర్వహించారు. ఇక్కడ దాదాపు వంద సంవత్సరాలు పైగా పండుగ నిర్వహిస్తున్నారు. కులమతాలకు అతీతంగా గ్రామంలో ప్రతి ఒక్కరు పాల్గొని పండుగ10రోజులపాటు నిష్టగా నిర్వహించారు. ఇక్కడ అన్ని కులాల వారు కలిసి భయభక్తులతో పండుగ జరుపుకుంటారు. ఈ ఊరిలో ముఖ్యంగా మొహర్రం చంద్రోదయం కనబడిన రోజు నుండి ఆషురా రోజు వరకు మద్యము, మత్తు పానీయాలు, మాంసాహారం ముట్టరు. ఈ సాంప్రదాయ గ్రామంలో అన్ని కులాల వారు పాటిస్తారు. శనివారం పండుగ చివరి రోజు కావడము వలన పీర్లను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ప్రతి ఒక్కరూ ఇమామ్ హస్సన్, హుస్సేన్ ఆశీర్వాదం తీసుకొని బెల్లంతో తయారు చేసిన పానకమునీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమం లో ఆలస్యం నరసింహారావు(పటేల్),ఆలస్యం మధు, ప్రసాద్, పెద్ద నరసింహారావు, మాజీ సర్పంచ్ జిల్లా రైతుబంధు నాయకులు మంకెన రమేష్, మాజీ సర్పంచ్ కిలారు సూర్య ప్రకాష్ రావు, కిలారు భూషయ్య, ఆలస్యం నాగేశ్వరావు, శివ కృష్ణ, వంకాయలపాటి పెద్ద వెంకయ్య, పులిపాటి వెంకయ్య రిటైర్డ్(ఎస్ఈ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్), ముస్లిం గ్రామపెద్దలు సౌందు సాహెబ్, షేక్ అఫ్జల్, పెద్ద ముజవర్ మదర్ సాహెబ్, షేక్ మీరా(పంగిడి బుజ్జ),ఎంపీటీసీ కొల్లి యామిని, సర్పంచ్ గొర్రెముచు ఈశ్వరమ్మ, ఉపసర్పంచ్ దూసరి గోపాల్ రావు, గ్రామపెద్దలు నున్న తాజుద్దీన్, నన్నక కోటయ్య, వంకాయలపాటి సత్యం, ఆలస్యం రాములు, దూసరి నేతాజీ, వంకాయలపాటి మాధవరావు, ఆలస్యం నరసయ్య, బాబు, మేడా అప్పారావు, షేక్ జాని మీయ(రామాపురం),పులిపాటి బాబు, వడ్డేపుడి ముత్తయ్య, చెవుల ఖాదర్ బాబు, వడ్డేపుడి క్రిష్ణ, వడ్డేపుడి బాబు, రాగం లింగబాబు, చెవుల ప్రసాద్, చెవుల తిరపయ్య, దోమకొండ వెంకన్న, కోట బుచ్చాలు, గ్రామప్రజలు తదితరులు ఉన్నారు.

### నేటి కందం- నేటికి అందం



కం|| స్నేహమ్మే మురిపెమునుచు
స్నేహమ్మే గొప్పదనుచు స్నేహితులకికన్
స్నేహ దినంబున - కవితా
నివాళి కలందజేతు నిర్మలమతినై !!

(జులై 30 అంతర్జాతీయ స్నేహ దినోత్సవం..
July 29 International Friendshi Day..)

-రాధశ్రీ
సెల్:9494481210

## ఎంపీ వద్దిరాజు ముంపు ప్రాంతాల సందర్శన

**- ఖమ్మంలో ముంపు ప్రాంతాలను సందర్శించిన మంత్రిఅజయ్ కుమార్,ఎంపీలు రవిచంద్ర, నాగేశ్వరరావు**

**- వరద బాధితులను పరామర్శించి నిత్యావసరాలు అందజేసిన మంత్రి,ఎంపీలు**

**- వరదలో కొట్టుకుపోయి మృతి చెందిన సతీష్ కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసానిచ్చిన ఎంపీలు**

ఖమ్మం, జులై 29: (నేటినిజం ప్రతినిధి): వరద బాధితులకు ఆశ్రయం కల్పించిన శిబిరాన్ని పరిశీలించిన ఎంపీలు రవిచంద్ర, నాగేశ్వరరావుభారీ వర్షాలు వరదల కారణంగా ఖమ్మం నగరంలో ముంపునకు గురైన ప్రాంతాలను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మంత్రి అజయ్ కుమార్, లోకసభలో బీఆర్ఎస్ పక్ష నాయకులు నామా నాగేశ్వరరావులతో కలిసి సందర్శించారు.

మంత్రితో కలిసి ఎంపీలు 47,48 డివిజన్లు, మోతీనగర్ తదితర ప్రాంతాలలో బాధితులను కలిసి నిత్యావసర సరుకులను అందజేశారు. అటుతర్వాత ఎంపీలు రవిచంద్ర, నాగేశ్వరరావులు ఖమ్మం రూరల్ మండలంలోని జలగం నగర్, పెద్దతండా, ఆర్టీసీ కాలనీ, కేబీఆర్ నగర్ తదితర చోట్ల బురదలో కాలినడకన తిరిగి వరదలో ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలించారు.

బాధితులను పరామర్శించి తక్షణ సహాయక చర్యలను పర్యవేక్షించారు, అధికారులకు తగు ఆదేశాలిచ్చారు.

వరదలో కొట్టుకుపోయిన పెంద్ర సతీష్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు, తమతో పాటు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవడం జరుగుతుందని భరోసానిచ్చారు. జలగంనగర్ లో ఆత్మహత్యకు పాల్పడిన కంపౌండర్ జానీమియా(సోను)



మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అనంతరం ఎంపీలు రవిచంద్ర, నాగేశ్వం రావులు నాయుడుపేటలో వరద బాధితులకు ఆశ్రయం కల్పించిన రామలీల ఫంక్షన్ హాలుకు వెళ్లి అందుతున్న సహాయాన్ని అడిగి తెలుసుకున్నారు.

ఎవరూ కూడా అధైర్యపడవద్దని బాధిత కుటుంబాలన్నింటికి నెలరోజులకు సరిపడు నిత్యావసరాలను ఇళ్లకు పంపుతామని అన్ని విధాలా ఆదుకుంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమాలలో జిల్లా కలెక్టర్ వీ.పీ.గౌతం, జెడ్పీ ఛైర్మన్ లింగాల కమల్ రాజ్, నగర్ మేయర్ నీరజ, డీసీసీబీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల వెంకటేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దోరేపల్లి శ్వేత, బీఆర్ఎస్ నాయ కులు పగడాల నాగరాజు, ఆర్జేసీ కృష్ణ, తోట రామారావు, కార్పొరే టర్లు తోట గోవిందమ్మ, మాటేటి అరుణ తదితరులు పాల్గొన్నారు.

## వరదల్లో బురద రాజకీయం చేస్తున్న విపక్షాలు : మంత్రి పువ్వాడ

ఖమ్మం, జులై 29: (నేటినిజం ప్రతినిధి): కొందరు వరదల్లో బురద రాజకీయం చేస్తున్నారని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏకధాటిగా కురిసిన వర్షాలతో ఖమ్మం నగరాన్ని మున్నేరు వాగు ముంచెత్తిందని చెప్పారు. ప్రాణనష్టం జరగకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. మున్నేరు వరద బాధిత కుటుంబాలకు పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత హెల్త్‌క్యాంపును మంత్రి పువ్వాడ ప్రారంభించారు. ఎంపీ నామా నాగేశ్వర రావుతో కలిసి వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వెయ్యి మందికి నిత్యావసర సరుకులు అందిస్తున్నామని వెల్లడించారు.

కాగా, మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎంపీలు నామా నాగేశ్వర రావు, వద్దిరాజు రవిచంద్ర పర్యటించారు. మోతినగర్, జలగంనగర్, కేబీఆర్‌నగర్‌లో బాధితులను పరామర్శించారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు.



ఈరోజు మహాకవి జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి 92వ జయంతి సందర్భంగా తెలంగాణ రచయితల సంఘం తెలుగు పద్య కవిత సదస్సు సంయుక్త ఆధ్వర్యంలో తెరసం అధ్యక్షుడు కొత్త అనిల్ కుమార్ సభాధ్యక్షతన వివేకానంద విద్యానికేతన్ లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గంద్ర లక్ష్మణ్ రావు గారు మాట్లాడుతూ "తెలుగు గేయ కవిత్వ ప్రభంజనం సృష్టించినారు. నిరంతరం సమకాలీన సాహితీ చైతన్యంతో కవిత్వాన్ని ఊపిరి గా జీవించారు" ప్రముఖ కవి దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ "సినారె మహా గొప్ప మానవతావాది వారి కవిత్వం నిండా అడుగడుగునా మానవతా వాదం కనిపిస్తుంది. విశ్వంభర ద్వారా తెలుగు సాహిత్యాన్ని కీర్తి పతాకాన నిలబెట్టారు."ప్రముఖ విశ్లేషకులు అన్నాడి గజేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ "చిన్నప్పుడే పల్లెటూరులో నాటకాల నుండి హరికథల నుండి పదాల సేకరణ చేసి నాగార్జున సాగరం ,కర్పూర వసంత రాయలు గేయకావ్యంతో సినీ గీతాలకు విశ్వ ప్రాచుర్యం కల్పించారు. అన్నారు. ప్రత్యేకత సదస్సు ప్రధాన కార్యదర్శి రాజా రామ్మోహన్ శర్మ దొమ్మటి శంకర్ ప్రసాద్ లో కార్యదర్శి నివేదిక సమర్పించారు ఈ కార్యక్రమంలో సాహితీ గౌతమి అధ్యక్షులు నంది శ్రీనివాస్,కె ఎస్ అనంతాచార్య, బొమ్మకంటి కిషన్,సత్యనారాయణ రాజు, శ్రీనివాస్ చారి, శశి కిరణ్మయి, రేగులపాటి విజయలక్ష్మి,నీలగిరి అనిత,గంగుల శ్రీకర్, కాండురి వెంకరేశ్వర్లు,ఎలని స్వామి,సంపత్ కుమార్ ఆచార్య లు పాల్గొన్నారు.

### మొహర్రం వేడుకల్లో అపశ్రుతి.. కరెంట్ షాక్‌తో బీటెక్ విద్యార్థి మృతి

అమరావతి : ఏపీలోని కర్నూలు జిల్లాలో విషాదం నెలకొని ఉంది. మొహర్రం వేడుకల్లో అపశ్రుతి జరగడంతో ఓ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. జిల్లాలోని సి.బెళగల్ మండలం గొల్లలదొడ్డిలో గ్రామానికి చెందిన యువకులు మొహర్రం వేడుకల్లో అలంకరణ ఏర్పాట్లు చేస్తుండగా శేఖర్ అనే యువకుడు కరెంట్ షాక్‌కు గురయ్యాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. శేఖర్ హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. వర్షాల కారణంగా ఇచ్చిన సెలవుల కారణంగా ఇంటికి చేరుకున్న యువకుడు మొహర్రం వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొనేందుకు వెళ్లి మృత్యువాత పడడంతో అతడి కుటుంబంలో విషాదం నెలకొని ఉంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

## తొలిసారిగా డెడ్ శాటిలైట్‌ను భూమిపైకి తెచ్చి సముద్రంలో కూల్చివేత

లండన్ జూలై 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: డెడ్ శాటిలైట్‌ను తొలిసారి భూమిపైకి తెచ్చి సురక్షితంగా సముద్రంలో కూల్చివేశారు. బ్రిటన్‌కు చెందిన ఎయిర్‌బస్ ఇంజినీర్లు వాతావరణాన్ని పర్యవేక్షించే ఏయోలస్ ఉపగ్రహాన్ని నిర్మించారు. 2018లో యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఏ) దీనిని లాంచ్ చేసింది. ఈ శాటిలైట్ కాలపరిమితి ఐదేళ్లు. ఇటీవల ఇంధనంతోపాటు మిషన్ కాలపరిమితి ముగిసింది. దీంతో డెడ్ అయిన ఈ శాటిలైట్ 200 మైళ్లు (సుమారు 320 కిలోమీటర్ల ) ఎత్తులో భూమి చుట్టూ తిరుగుతున్నది. అయితే నియంత్రిత పద్ధతిలో భూమి వాతావరణంలోకి తెచ్చి సురక్షితంగా కూల్చివేసే విధంగా ఈ ఉపగ్రహాన్ని రూపొందించలేదు.కాగా, శాటిలైట్ ఏయోలస్‌ను సురక్షితంగా కూల్చివేయడం కోసం యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఏ) ఇతర సంస్థలతో కలిసి కొన్ని నెలలపాటు ప్లాన్ చేసింది. ఈ నేపథ్యంలో జర్మనీలోని మిషన్ కంట్రోల్ నుంచి శాటిలైట్ కక్ష్యను తగ్గించే చర్యలు చేపట్టారు. దీంతో ఈ నెల 24న ఆ డెడ్ శాటిలైట్ 280 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకున్నది. ఆ తర్వాత దాని ఎత్తు 250 కిలోమీటర్లకు తగ్గించారు. అలా క్రమంగా ఉపగ్రహం ఎత్తు తగ్గిస్తూ వచ్చారు. శుక్రవారం నాటికి భూమి నుంచి 120 కిలోమీటర్ల ఎత్తుకు ఏయోలస్ చేరుకున్నది. అనంతరం దాని కక్ష్యను మరింతగా మార్చు చేశారు. చివరకు ఆ శాటిలైట్ అట్లాంటిక్ మహాసముద్రంలో సురక్షితంగా కూలింది.

## పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై జాగ్రత్తలు తీసుకోవాలి

**-ఉన్నతాధికారులతో రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ టెలీకాన్ఫరెన్స్**



హైదరాబాద్ జూలై 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో సహాయక చర్యలపై కలెక్టర్లు, పురపాలక శాఖ ఉన్నతాధికారులతో రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై జాగ్రత్తలు తీసుకోవాలని కేటీఆర్ ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలి. సహాయసహకారాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇతర శాఖలతో మున్సిపల్ అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. నిండిన చెరువులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. సహాయక చర్యలకు ప్రతి జిల్లాలో కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. రహదారులపై పేరుకుపోయిన బురదను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రతి పట్టణంలో ప్రత్యేకంగా పారిశుద్ధ్య డ్రైవ్‌ని చేపట్టాలన్నారు. ప్రజలు మంచినీరు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పెద్ద ఎత్తున మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి. శిథిలావస్థలో ఉన్న పురాతన భవనాలు తొలగగించాలి. విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకొని మరమ్మతులు చేయాలని అధికారులను కేటీఆర్ ఆదేశించారు.

## నల్గొండ అదనపు కలెక్టర్‌గా హేమంత్ కేశవ్ పాటిల్.. బాధ్యతల స్వీకరణ



నల్గొండ, జులై 29: నల్గొండ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా హేమంత్ కేశవ్ పాటిల్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కలెక్టర్ల సాధారణ బదిలీలలో భాగంగా సూర్యా పేట జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న హేమంత్ కేశవ్ పాటిల్ ను కొమరం భీం అసిఫా బాద్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా బదిలీ చేసింది.

కాగా ఆయనను ప్రభుత్వం తిరిగి నల్లగొండ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా శుక్రవారం బదిలీ చేసింది. ఈ సందర్భంగా ఆయన శనివారం జిల్లా కలెక్టరేట్ లోని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించే ముందు హేమంత్ కేశవ్ పాటిల్ జిల్లా కలెక్టర్ అర్.వి.కర్ణన్ ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

## జిల్లా కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఐ కరుణాకర్‌కు ఘన సన్మానం



రాజన్న సిరిసిల్ల, జులై 29:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ ను శనివారం జిల్లా స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ ల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగానూతన బాధ్యతలు తీసుకున్న సీఐ కరుణాకర్ ను శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ అబ్దుల్ మన్నాన్, కరాటే అసోసియేషన్ జిల్లా కోశాధికారి, న్యాయవాది అవధూత రజినీకాంత్, జిల్లా సభ్యులు దండుగుల తిరుపతి, దండగల దేవయ్య, శివరాత్రి రాజు, కనకరపు రాజశేఖర్ లు ఉన్నారు.

# ధన, కండ బలాలే ప్రజాస్వామ్యాన్ని ఓడిస్తున్నాయా?!

కండ బలానికి కలం గజగజ వణుకుతున్నది. నోటును చూసి ఓటు తల వంచుతున్నది. ఎన్నికల్లో రక్తపాతం అనివార్యం అవుతున్నది. బ్యాలెట్ బాక్సులు అసాంఘిక శక్తుల చేతిలో విలవిల్లాడుతూ విచ్ఛిన్నం అవుతున్నాయి. ధనస్వామ్యం ముందు ప్రజాస్వామ్యం వెలవెలబోతున్నది. రాజ్యాంగం పుస్తకాలకు మాత్రమే పరిమితం అవుతున్నది. బాంబులు క్యూలైన్లను కూలదోస్తున్నాయి. రిగ్గింగులు సర్వసాధారణం అవుతున్నాయి. రాజకీయం రాక్షస రంగును పులుముకుంటున్నది. రాజకీయ నాయకులు రావణాసురులను ఆదర్శంగా తీసుకుంటున్నారు. ధన, కండ బలాలే ఎన్నికలను శాసిస్తున్నాయి. రాజకీయ హింసాత్మక కత్తులు దినదినం పదునెక్కుతున్నాయి. ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్ పంచాయతీ ఎన్నికలు ఈ విషయ విషయాలను రుజువు చేస్తున్నాయి.

## పశ్చిమ బెంగాల్ పంచాయితీ ఎన్నికల్లో హింస:

పశ్చిమ బెంగాల్‌లో తాజాగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తృణముల్ కాంగ్రెస్ విజయభేరి మోగించిన విషయం మనకు తెలుసు. మరో కోణంలో చూసినపుడు ఈ ఎన్నికలు ప్రకటించిన రోజు నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకు 45 మంది రాజకీయ హింసాత్మక ఘటనల్లో ప్రాణాలు కోల్పోయారు. ఈ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం పరిహాసం పాలయ్యింది. బూత్ ఆక్రమణలు, రిగ్గింగ్, బ్యాలెట్ బాక్సుల అపహరణ/విధ్వంసం, బాంబుల మోతలు, అసాంఘిక శక్తులు రెచ్చిపోవడం లాంటి అనేక ఘటనలు నమోదు అయ్యాయి. రాజకీయ నాయకులు ప్రోత్సహించిన హింసాత్మక ఘటనల్లో వేలల్లో గాయపడడం, చివరికి కనీసం 45 మంది చనిపోవడం అత్యంత విచారకరం. గతంలో మిలటరీ డేగ కన్ను వ్యాపించిన అస్సాం జమ్ము కాశ్మీర్ ప్రాంతాల్లో ఎన్నికల హింసాత్మక ఘటనలు అధికంగా నమోదు అయ్యేవి. పశ్చిమ బెంగాల్‌లో 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 365 హింసాత్మక ఘటనలు, 2018 పంచాయతీ ఎన్నికల సందర్భంగా 44 మరణాలు జరిగినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి.

## రాజకీయ హింసాత్మక ఘటనలు నమోదైన రాష్ట్రాలు:

2016 నుంచి నేటి వరకు వివిధ రాష్ట్రాల్లో నమోదైన అసాంఘిక సాయుధ శక్తుల దాడులు, ప్రదర్శనలను అదుపు చేసే దుర్ఘటనలు, ఆస్తుల ధ్వంసం, అల్లరి మూకల భయానక దుశ్చర్యలు, అరెస్టులు లాంటి పలు రాజకీయ హింసాత్మక ఘటనలను పరిశీలించినపుడు దేశంలో ప్రజాస్వామ్యం పతన స్థాయికి చేరుతున్నదనే అభిప్రాయాలు పెరుగుతున్నాయి. 2016 – 2023 మధ్య కాలంలో, ముఖ్యంగా జనరల్ ఎలక్షన్లలో జె అండ్ కె, పశ్చిమ బెంగాల్, యూపీ, పంజాబ్, బీహార్, అస్సాం, త్రిపుర, ఛత్తీస్‌ఘడ్, కేరళ లాంటి రాష్ట్రాల్లో అత్యధిక రాజకీయ హింసాత్మక ఘటనలు జరిగాయని వివరాలు సమర్థిస్తున్నాయి. 2016 నుంచి నేటి వరకు జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ, పంచాయతీ ఎన్నికల్లో జమ్ము-కశ్మీర్‌లో 8,301, పశ్చిమ బెంగాల్‌లో 3,338, యూపీలో 2,618, పంజాబ్‌లో 2,040 రాజకీయ హింసాత్మక ఘటనలు నమోదు కావడం గమనించారు. అతి తక్కువ హింసాత్మక ఘటనలు నమోదైన రాష్ట్రాల జాబితాలో హిమాచల్, ఉత్తరాఖండ్, తెలంగాణ, ఏపీ, ఢిల్లీ, గోవా, అరుణాచల్, సిక్కింలు, మేఘాలయా, రాజస్థాన్, కర్నాటక రాష్ట్రాలు 2016 నుంచి నేటి వరకు 700 కన్న తక్కువ ఘటనలను నమోదు చేశాయి.

ప్రజాస్వామ్యానికి ఎన్నికలే పునాది. రాజ్యాంగ విలువలకు పట్టం కట్టడం మన కనీస కర్తవ్యం కావాలి. ప్రశాంత వాతావరణంలో ప్రజలు స్వేచ్ఛగా ఓట్లు వేయగలిగితేనే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. రాక్షస రాజకీయ నాయకులను మట్టు పెట్టి నైతిక రాజకీయాలకు మందిరం కట్టాలి. మనం కలలు కనే హింస కానరాని భవ్య భారతం మన కళ్ల ముందుండాలి. రాజకీయ హింసకు మంగళం పాడుతూ జనస్వామ్యం జెండా ఎగురవేయాలి. జై హింద్ అంటూ ప్రతి గళం సగర్వంగా నిలబడాలి.

జై హింద్ , జై భారత్, జై జై డెమక్రసీ.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# శరవేగంగా మచిలీపట్నం పోర్టు పనులు - జిల్లా కలెక్టర్ రాజాబాబు



మచిలీపట్నం, జులై 29:: మచిలీపట్నం పోర్టు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, వివిధ పనులకు నిర్దేశించిన టైం లిమిట్ లో పనులు పురోగతిలో ఉన్నాయని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి తమ క్యాంపు కార్యాలయం నుండి శనివారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్రంలో పోర్టు అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు.

జిల్లా కలెక్టర్ తమ బంగ్లా నుండి పోర్టు, రెవిన్యూ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొని మచిలీపట్నం పోర్టు అభివృద్ధి పనుల పురోగతి సిఎస్ కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ రైల్ రోడ్ కనెక్టివిటీ సంబంధించి మూడు దశల్లో చేపట్టే రహదారి అభివృద్ధి పనులకు సంబంధించి మొదటి దశలో బీచ్ రోడ్డు నుండి బ్రేక్ వాటర్ వరకు మెటీరియల్ తరలించుటకు తాత్కాలిక రహదారి పనులు పూర్తయ్యాయని, ఈ రహదారి శాశ్వత అభివృద్ధి పనులు వెంటనే మొదలు పెట్టాలని, రెండవ, మూడవ దశల్లో రహదారి అభివృద్ధి పనులకు సంబంధించి భూ సేకరణ పనులు వేగవంతం గావించాలని అధికారులను ఆదేశించారు.

సౌత్ బ్రేక్ వాటర్ పనులు 280 మీటర్ల వరకు పూర్తికాగా, నార్త్ బ్రేక్ వాటర్ పనులు వేగవంతం గావించాలన్నారు. టర్నింగ్ సర్కిల్ ఏరియా వద్ద ల్యాండ్ సైడ్ డ్రెడ్ జింగ్ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు.

డిఆర్ఓ ఎం వెంకటేశ్వర్లు, ఆర్డిఓ ఐ కిషోర్, మచిలీపట్నం పోర్టు డెవలప్మెంట్ కార్పొరేషన్ ఈడీ విద్యాశంకర్, ఏ .ఈ. కే మహేష్, కలెక్టరేట్ సూపరింటెంట్ రాధిక, తాసిల్దారు శ్రీవిద్య వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

# ప్రపంచ ఫార్మసీగా గుర్తింపు పొందిన భారతదేశాన్ని ప్రపంచ ఫార్మా ఉత్పత్తి కేంద్రంగా అభివృద్ధి చేయాలి..

## - కేంద్ర మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, జులై 29: ప్రపంచ ఫార్మసీగా గుర్తింపు పొందిన భారతదేశాన్ని ప్రపంచ ఫార్మా ఉత్పత్తి కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కృషి జరగాలని కేంద్ర మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అన్నారు. "గ్లోబల్ కెమికల్స్ అండ్ పెట్రోకెమికల్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్స్ ఇన్ ఇండియా" సదస్సు ముగింపు కార్యక్రమంలో డాక్టర్ మాండవీయ పాల్గొన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) సహకారంతో " గ్లోబల్ కెమికల్స్ అండ్ పెట్రోకెమికల్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్స్ ఇన్ ఇండియా " (ఉఅఖఓఉ 2023)పై 3వ సదస్సు జరిగింది. రసాయనాలు, పెట్రో కెమికల్స్ రంగానికి చెందిన ప్రముఖ సంస్థలు, నిపుణులు సదస్సులో పాల్గొన్నారు. వృత్తాకార సుస్థిర అభివృద్ధి ఇతివృత్తంతో సదస్సు జరిగింది.

ముగింపు సమావేశంలో ప్రసంగించిన డాక్టర్ మాండవీయ స్వావలంబన సాధించడానికి ప్రతి దేశ ఆర్థిక వ్యవస్థకు పటిష్టమైన పరిశ్రమ రంగం సహకారం అవసరం ఉంటుందన్నారు. విడివిడిగా కాకుండా మొత్తం పరిశ్రమ అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు అమలు చేస్తుందని డాక్టర్ మాండవీయ అన్నారు. తక్కువ ప్రభుత్వ ప్రమేయంతో గరిష్ట పాలన అందించడానికి దోహదపడే సమగ్ర, సంపూర్ణ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని డాక్టర్ మాండవీయ వివరించారు. రసాయనాలు, పెట్రో కెమికల్స్ రంగంలో సానుకూల మార్పు,పురోగతి కోసం వినూత్నమైన, స్థిరమైన పరిష్కారాలను అందించాలని మంత్రి కోరారు.

రెండు రోజుల పాటు జరిగిన సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పరిశ్రమల ప్రతినిధులు వివిధ అంశాలపై చర్చలు జరిపారని కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ, రసాయనాలు పెట్రోకెమికల్స్ శాఖ కార్యదర్శి శ్రీ అరుణ్ బరోకా తెలిపారు. రసాయనాలు, పెట్రోకెమికల్స్ పరిశ్రమ రంగానికి అవసరమైన నిధులు, పర్యావరణ అనుమతులు లాంటి వివిధ అంశాలపై చర్చలు జరిగాయన్నారు.

రసాయనాలు, పెట్రో కెమికల్ రంగం అభివృద్ధికి కృషి చేస్తిన వివిధ పరిశ్రమల ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు.

# వాగులో కారు గల్లంతు.. వీడని ఉత్కంఠ



మెదక్, జులై 29:(నేటినిజం ప్రతినిధి):ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరద ఉధృతికి కారు వాగులో గల్లంతైనట్లు స్థానికులు తెలిపిన ఘటనలో ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. సిద్దిపేట జిల్లా అక్కనపల్లి వాగులో శుక్రవారం రాత్రి కారు గల్లంతైనట్లు స్థానికుల సమాచారం తో శనివారం ఉదయం నుండి గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

సిద్దిపేట ఏసీపీ సురేందర్ రెడ్డి పర్యవేక్షణలో గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

అక్కనపల్లి వాగు క్యాజ్ వే నుండి పోరెడ్డిపల్లి వంతెన వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర డ్రోన్ కెమెరాలతో, గజ ఈతగాళ్లు వాగును జల్లెడ పడుతున్నారు. వాగులో వరద ఉధృతి అధికంగా ఉండటంతో గాలింపు చర్యలకు ఆటంకం కలుగుతుంది.

కాగా అక్కనపల్లి వాగులో కారు గల్లంతైన ఘటనలో ప్రయాణికులు క్షేమంగా బయటపడాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

# జి-20 కి చెందిన పర్యావరణం మరియు శీతోష్ణస్థితి మంత్రుల సమావేశం

న్యూఢిల్లీ, జులై 29:చెన్నై లో ఏర్పాటైన జి-20 పర్యావరణం మరియు శీతోష్ణస్థితి మంత్రుల సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న వీడియో సందేశం మాధ్యం ద్వారా ప్రసంగించారు.

ప్రముఖుల కు చెన్నై నగరం లోకి ఇదే స్వాగతం అని ప్రధాన మంత్రి పేర్కొంటూ చెన్నై నగరం సంస్కృతి పరం గాను మరియు చరిత్ర పరం గాను సుసంపన్నమైన నగరం గా ఉందన్నారు. యూనెస్కో ప్రపంచ వారసత్వ స్థలం అయినటువంటి మామల్లపురమ్ 'తప్పక చూడవలసినటువంటి ప్రదేశం' అని, దానిని దర్శించుకోవాలని వారి కి ఆయన విజ్ఞప్తి చేశారు. అక్కడ రాళ్ల చెక్కడం పనితనం మరియు ఆ శిల్పాల సోయగం స్ఫూర్తి ప్రదాయకాలు అని ఆయన అన్నారు.

రెండు వేల సంవత్సరాల నాటి మహా కవి తిరువళ్ళువర్ గారు చెప్పిన మాటల ను ప్రధాన మంత్రి ఉదాహరిస్తూ, "మహా సముద్రాల జలాల నుండి రూపుదిద్దుకొన్న మేఘాలు ఆ నీటి ని వర్షం రూపం లో మళ్లీ భూమి కి ఇవ్వలేదో సాగరాలు అయినా సరే ఇగుర్చుకుపోతాయ"ని అన్నారు. ప్రకృతి మరియు ప్రకృతి యొక్క స్వభావం భారతదేశం లో జ్ఞానార్జన కు ఒక నిరంతరాయ వనరు గా నిలుస్తూ వస్తున్న సంగతి ని గురించి ప్రధాన మంత్రి వివరిస్తూ, మరొక సంస్కృత శ్లోకాన్ని ఉట్టంకించారు.. "నదులు వాటి లోని జలాల ను త్రాగివేయలేవు, మరి వృక్షాలు వాటి ఫలాల ను ఆరగించ జాలవు. మబ్బులు వాటి లో ఉండే నీటి వల్ల జనించే ధాన్యాన్ని భుజించ లేవు" అని శ్లోకార్థాన్ని ఆయన వివరించారు. మనల ను ప్రకృతి పోషిస్తున్నటువంటి కారణం గా ప్రకృతి ని మనం పోషిస్తూ ఉండాలి అని ప్రధాన మంత్రి నొక్కి చెప్పారు. నేల తల్లి ఆలన పాలన మన ప్రధానమైన బాధ్యత గా ఉంది; మరి ఇదే ఈ రోజు న 'క్లయిమేట్ ఏక్షన్' గా రూపుదిద్దుకొంది. ఈ కర్తవ్యాన్ని చాలా కాలం నుండి ఉపేక్షిస్తూ రావడమే ఈ స్థితి కి కారణమైంది అని ఆయన అన్నారు. భారతదేశం యొక్క సాంప్రదాయిక జ్ఞానాన్ని పట్టి చూస్తే క్లయిమేట్ ఏక్షన్ అనేది అవశ్యం 'అంత్యోదయ' బాట లో సాగవలసి ఉంది అని ప్రధాన మంత్రి అన్నారు. ఇక్కడ అంత్యోదయ కు అర్థం సమాజం లో ఆఖరు వ్యక్తి కి సైతం ఉన్నతి ని, వృద్ధి ని అందేటట్లు చూడడం అని ఆయన చెప్పారు. జలవాయు పరివర్తన మరియు పర్యావరణ సంబంధి అంశాల వల్ల ఎక్కువ గా ప్రభావితం అవుతున్నది ప్రపంచం లోని 'గ్లోబల్ సౌథ్' (అంటే తక్కువ ఆదాయం, అధిక జనాభా. పేలవమైన మౌలిక సదుపాయాలు వెరసి అభివృద్ధిశీల దేశాలు గా వ్యవహారం లో ఉన్న దేశాలు) అని ప్రధాన మంత్రి చెప్తూ, 'యుఎన్ క్లయిమేట్ కన్ వెన్శన్' మరియు 'పేరిస్ ఒప్పందం' లలో చెప్పుకొన్న సంకల్పాల విషయం లో కార్యాచరణ ను వృద్ధి చెందింప చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది అని స్పష్టం చేశారు. అదే జరిగితే గ్లోబల్ సౌథ్ దేశాలు వాటి అభివృద్ధి పరమైన మహత్వాకాంక్షల ను శీతోష్ణస్థితి పట్ల మిత్ర పూర్వకమైన విధానం లో నెరవేర్చుకోవడం లో సాయపడడం లో కీలకమైన తోడ్పాటు ను అందించినట్లు అవుతుంది అని ఆయన పేర్కొన్నారు.

భారతదేశం తాను గొప్ప గా నిర్దేశించుకొన్నటువంటి 'సంకల్పయుక్తమైనటువంటి తోడ్పాటు ల' ద్వారా మార్గదర్శి గా నిలవడం పట్ల గర్వం గా ఉంది అని ప్రధాన మంత్రి అన్నారు. శిలాజేతర ఇంధన వనరుల నుండి స్థాపిత విద్యుత్తు సామర్థ్యం లక్ష్యాన్ని 2030 వ సంవత్సరాని కల్లా అందుకోవాలని తలచినా అంత కంటే తొమ్మిది సంవత్సరాలు ముందే ఆ లక్ష్యాన్ని సాధించిన సంగతి ని ఆయన ప్రస్తావించి, మరి ఇప్పుడు సవరించిన లక్ష్యాల ద్వారా మరింత ఎక్కువ ఫలితాల పైన దృష్టి ని సారించడం జరిగింది అన్నారు. నవీకరణ యోగ్య శక్తి సంబంధి స్థాపిత సామర్థ్యం విషయం లో భారతదేశం ప్రస్తుతం ప్రపంచం లోని అగ్రగామి 5 దేశాల లో ఒకటి గా ఉంది అని కూడా ఆయన చెప్తూ, 2070 వ సంవత్సరాని కల్లా 'నెట్ జీరో' లక్ష్యాన్ని సాధించాలన్న సంకల్పాన్ని దేశం తీసుకొందన్నారు. ఇంటర్ నేశనల్ సోలర్ అలాయన్స్, సిడిఆర్ఐ, ఇంకా ద 'లీడర్ శిప్ గ్రూప్ ఫార్ ఇండస్ట్రీ ట్రాంజీశన్ ' లు సహా, పలు కూటముల ద్వారా భారతదేశం తన భాగస్వామ్య దేశాల తో కలసి ముందుకు సాగిపోతూ ఉండగలదన్న ఆశాభావాన్ని శ్రీ నరేంద్ర మోదీ వ్యక్తం చేశారు.

జీవవైవిధ్యం సంరక్షణ, పరిరక్షణ, పునరుద్ధరణ మరియు సంవర్ధనీకరణ అంశాల లో ఎడతెగని కార్యాల ను చేపడుతూ ఉండడాన్ని గురించి ప్రధాన మంత్రి ప్రముఖం గా ప్రకటిస్తూ, "భారతదేశం ఒక మహా వైవిధ్యయుక్త దేశం" అని అభివర్ణించారు. కార్చిచ్చు లు మరియు గనుల తవ్వకం కార్యకలాపాల వల్ల ప్రభావితం అయినటువంటి ప్రముఖ స్థలాల పునరుద్ధరణ కు "గాంధీనగర్ ఇంప్లిమెంటేశన్ రోడ్ మ్యాప్ ఎండ్ ప్లాట్ ఫార్మ్" కార్యక్రమం ద్వారా గుర్తింపు లభిస్తున్నందుకు ఆయన సంతోషాన్నివ్యక్తం చేశారు. భూ గ్రహం లో ఏడు విశిష్ట వ్యాఘ్రాల సంరక్షణ నిమిత్తం 'ఇంటర్ నేశనల్ బిగ్ కేట్ అలాయన్స్' ను ఇటీవలే ప్రారంభించిన సంగతి ని ఆయన పేర్కొంటూ, ఈ ఖ్యాతి 'ప్రాజెక్ట్ టైగర్' పరం గా అనుభవం లోకి వచ్చిన బోధలకు దక్కుతుంది అన్నారు. ప్రాజెక్ట్ టైగర్ అనేది సంరక్షణ ప్రధానమైనటువంటి కార్యక్రమాల లో అగ్రగామి కార్యక్రమం గా ఉంది. ప్రాజెక్ట్ టైగర్ చలవ తోనే ప్రస్తుతం ప్రపంచ పులుల సంతతి లో 70 శాతం పులులు భారతదేశం లో మనుగడ సాగిస్తున్నాయి అని ఆయన తెలియ జేశారు. ప్రాజెక్ట్ లయన్ మరియు ప్రాజెక్ట్ డాల్ఫిన్ సంబంధి కార్యాచరణ ఒక కొలిక్కి వస్తున్న విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు.

భారతదేశం లో అమలవుతున్న కార్యక్రమాల కు చోదక శక్తి గా ప్రజల యొక్క ప్రాతినిధ్యం ఉంటున్నది అని ప్రధాన మంత్రి స్పష్టం చేస్తూ, 'మిశన్ అమృత్ సరోవర్' ను గురించి చెప్పారు. మిశన్ అమృత్ సరోవర్ ఒక అద్వితీయమైనటువంటి జల సంరక్షణ కార్యక్రమం గా ఉంది. దీనిలో భాగం గా ఒక సంవత్సరం కాలం లోనే 63,000 కు పైచిలుకు జల వనరుల ను అభివృద్ధి పరచడమైంది. ఈ కార్యక్రమాన్ని సాంకేతిక విజ్ఞానం అండ తో పూర్తి గా సముదాయ భాగస్వామ్యం ద్వారా అమలుపరచడం జరిగింది అని ఆయన వెల్లడించారు. 'కేచ్ ద రేన్' ప్రచార ఉద్యమాన్ని గురించి కూడా ఆయన ప్రస్తావించారు. ఈ కార్యక్రమం సుమారు గా 2,50,000 రీ యూస్ అండ్ రీ ఛార్జ్ స్ట్రక్చర్ స్ ను రూపుదిద్దడం తో పాటుగా 2,80,000 కు పైచిలుకు వాటర్ హార్ విస్టింగ్ స్ట్రక్చర్ స్ ఏర్పాటు కు దారితీసింది అని వివరించారు. "దీనిని అంతటి ని ప్రజల భాగస్వామ్యం తోను, స్థానిక భూ స్థితి ని, జల స్థితి ని లెక్క లోకి తీసుకొని రూపు దిద్దడమైంది" అని ప్రధాన మంత్రి తెలిపారు. గంగ నది శుద్ధి కోసం తలపెట్టినటువంటి 'నమామి గంగే మిశన్' లో సముదాయాల భాగస్వామ్యాన్ని ప్రభావవంతం అయినటువంటి రీతి లో వినియోగించుకొంటున్న విషయాన్ని సైతం శ్రీ నరేంద్ర మోదీ ప్రస్తావించారు. ఈ కార్యక్రమం ద్వారా నది లో అనేక చోట్ల గాంగెటిక్ డాల్ఫిన్ జాడ తిరిగి కనుపించడం ఒక ప్రధానమైన కార్యసాధన గా నిలచింది అన్నారు. మాగాణి నేల ల సంరక్షణ లో 75 భూభాగాల ను రాంసర్ స్థలాలు గా గుర్తించిన సంగతి ని ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, ఆసియా లో రాంసర్ స్థలాల అతి పెద్దదైనటువంటి నెట్ వర్క్ భారతదేశం లోనే ఉంది అని ప్రధాన మంత్రి పేర్కొన్నారు.

'చిన్నవైన ద్వీప దేశాల'ను 'పెద్ద సాగర దేశాలు' గా ప్రధాన మంత్రి అభివర్ణిస్తూ, సాగరాలు ఈ దేశాల కు కీలకమైన ఆర్థిక వనరు గా ఉంటున్నాయి. అంతేకాకుండా యావత్తు ప్రపంచం లో మూడు వందల కోట్ల కు పైచిలుకు ప్రజానీకం యొక్క బ్రతుకుదెరువు కు దన్ను గా నిలుస్తున్నాయి. అపారమైనటువంటి జీవవైవిధ్యాని కి అవి నిలయాలు గా ఉంటున్నాయి అని ఆయన చెప్తూ, మహా సముద్రాల లో లభించే వనరుల ను సంబాళించడం తో పాటు గా బాధ్యతయుక్తమైన రీతి న వినియోగించుకోవడానికి కూడాను ప్రాముఖ్యాన్ని కట్టబెట్టాలి అని నొక్కి పలికారు. "స్థిరమైనటువంటి మరియు ఆటుపోటుల కు తట్టుకొని నిలచేటటువంటి బ్లూ ఇకానమీ ని మరియు మహాసముద్రాల పై ఆధారపడి ఉండేటటువంటి ఆర్థిక వ్యవస్థ ను ఆవిష్కరించడం కోసం ఉద్దేశించిన జి-20 ఉన్నతస్థాయి సూత్రాల కు ఆమోదం లభిస్తుందన్న ఆశాభావాన్ని ప్రధాన మంత్రి వెలిబుచ్చారు. ప్లాస్టిక్ సంబంధి కాలుష్యాని కి స్వస్తి పలకడం కోసం ఒక దీటైన అంతర్జాతీయ స్థాయి లో చట్టపరం గా ఆచరించక తప్పని ఒడంబడిక కై సార్థకమైన కృషి ని చేయవలసిందంటూ జి-20 సభ్యత్వ దేశాల కు ప్రధాన మంత్రి పిలుపునిచ్చారు.

'మిశన్ లైఫ్' – లైఫ్ స్టయిల్ ఫార్ ఎన్ వైరన్ మంట్ ను ఐక్య రాజ్య సమితి సెక్రట్రి జనరల్ తో కలసి కిందటి సంవత్సరం లో ప్రారంభించిన సంగతి ని ప్రధాన మంత్రి గుర్తు కు తీసుకు వచ్చారు. మిశన్ లైఫ్ అనేది ఒక ప్రపంచ స్థాయి ప్రజా ఉద్యమం, అది పర్యావరణాన్ని పరిరక్షించడాని కి మరియు పదిలం గా ఉంచడానికి ఊతం గా నిలచేటటువంటి వ్యక్తిగత స్థాయి మరియు సామూహిక స్థాయి కార్యాచరణ ను ప్రేరేపిస్తుందన్నారు. భారతదేశం లో ఏ వ్యక్తి, ఏ కంపెనీ లేదా ఏ స్థానిక సంస్థ అయినా చేపట్టేటటువంటి పర్యావరణ మిత్రపూర్వక కార్యాలు గుర్తింపున కు నోచుకోకుండా ఉండవు అని ప్రధాన మంత్రి అన్నారు. ఇటీవలే ప్రకటించిన 'గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్' లో భాగం గా ఇక మీదట గ్రీన్ క్రెడిట్స్ ను సంపాదించుకోవచ్చు

# తన బరువుతో చక్కెరను ఇచ్చి మొక్కు తీర్చుకున్న మంత్రి జయరామ్



కర్నూలు జిల్లా , జులై 29: హాలహర్వి మండలంలోని కామినహాల్ గ్రామంలో ఈరోజు మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో వెలిసినటువంటి హుసేన్ హుస్సేన్ పీర్ల దేవులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాంప్రదాయ బద్ధంగా మంత్రి గుమ్మనూరు జయరాం చక్కెరతో తులభారం ఇచ్చి తమ మొక్కును సమర్పించుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రి పరిపాలన దేశంలోనే ఆదర్శంగా ఉందని తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆ స్వామిని కోరుకోవడం జరిగిందని తెలిపారు. ఈ ఏడాది రైతులకు అధిక దిగుబడి రావాలని స్వామి వారిని మొక్కున్నారు. ప్రతి సంవత్సరం పీర్ల పండుగ సందర్భంగా ఈ గ్రామానికి రావడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి, జడ్పీటీసీ లింగప్ప, మండల కన్వీనర్ భీమప్ప చౌదరి, కామిహాల్ సర్పంచ్ భర్త జనార్ధన్ నాయుడు, చిప్పగిరి ఎంపీపీ భర్త మరయ్యా, మండల కన్వీనర్ వీరేష్, నాయకులు రంగారావు చంద్ర, తదితరులు పాల్గొన్నారు.



# గుజరాత్లోని గాంధీనగర్‌లో ‘సెమికాన్ ఇండియా-2023’కి ప్రధాని ప్రారంభోత్సవం

న్యూఢిల్లీ, జులై 29: ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ గుజరాత్‌లోని గాంధీనగర్‌లోగల మహాత్మా మందిర్‌లో ‘ఉత్ప్రేరకంగా భారత సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థ’ అనే ఇతివృత్తంతో నిర్వహించే ‘సెమికాన్ఇండియా-2023’ను ప్రారంభించారు. ఇది భారత సెమీకండక్టర్ వ్యూహం, విధానాలను ప్రపంచానికి ప్రస్ఫుటం చేస్తుంది. అలాగే సెమీకండక్టర్ల రూపకల్పన, తయారీ, సాంకేతిక అభివృద్ధికి భారతదేశాన్ని ప్రపంచ కూడలిగా మారుస్తుంది. ఈ సందర్భంగా ఈ పరిశ్రమలో అగ్రగామి సంస్థల అధినేతలు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఈ మేరకు ‘సెమి శ్రీ’ సంస్థ ప్రెసిడెంట్-సీఈవో శ్రీ అజిత్ మినోచా మాట్లాడుతూ- భారతదేశ చరిత్రలో తొలిసారి భౌగోళిక-దేశీయ రాజకీయాలతోపాటు ప్రైవేట్ రంగ గుప్త సామర్థ్యాలు మన దేశం సెమీకండక్టర్ ఉత్పాదక కూడలిగా మారేందుకు అనుకూలిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు మైక్రాన్ సంస్థ పెట్టుబడులు భారత్‌లో చరిత్ర సృష్టిస్తున్నాయని, ఇతర కంపెనీలు కూడా ఇదే బాటను అనుసరించేలా తగిన వేదికను ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేశంలో సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోగల నాయకత్వం ఉన్నందునే ప్రస్తుత వ్యవస్థ విభిన్నంగా ఉందని ఆయన గుర్తుచేశారు. తదనుగుణంగా సెమీకండక్టర్ల విషయంలో భారతదేశం ఆసియాలో అగ్రగామిగా అవతరించగలదని విశ్వాసం వ్యక్తం చేశారు.

అమెరికా అధ్యక్ష భవనంలో ‘ఎఎండి’ సీఈవోతో ప్రధానమంత్రి సమావేశం కావడాన్ని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్-చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (ఇవిపి/సిటిఒ) శ్రీ మార్క్ పేపర్‌మాస్టర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో రాబోయే ఐదేళ్లలో ‘ఎఎండి’ భారతదేశంలో 400 మిలియన్ డాలర్ల మేర పెట్టుబడి పెడుతుందని ఆయన ప్రకటించారు. అలాగే తమ పరిశోధన-అభివృద్ధి సామర్థ్యాల మెరుగుసహా బెంగళూరులో అతిపెద్ద డిజైన్ సెంటర్ నిర్మిస్తామని ఆయన వెల్లడించారు.

‘సెమీకండక్టర్ ప్రాడక్ట్ గ్రూప్ అప్లైడ్ మెటీరియల్స్’ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రభు రాజా మాట్లాడుతూ- ప్రధాని మోదీ దృఢమైన దృక్పథంతో భారతదేశం ప్రపంచ సెమీకండక్టర్ పరిశ్రమలో కీలక పాత్ర పోషణకు సిద్ధంగా ఉందన్నారు. ‘‘ఇది భారతదేశం ఉజ్వల కాంతులు వెదజల్లే సమయమని మా ప్రగాఢ విశ్వాసం’’ అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ రంగంలో సవాళ్లను ఏదో ఒక కంపెనీ లేదా దేశం అధిగమించడం అసాధ్యమని స్పష్టం చేశారు. లేవు. ఆ మేరకు సహకార భాగస్వామ్యం అవసరమని, అందుకు ఇదే తగిన సమయమని పేర్కొన్నారు. ఈ కొత్త సహకార నమూనా సెమీకండక్టర్ల రంగంలో మనకు ఉత్ప్రేరకం కాగలదని నొక్కి చెప్పారు. ‘‘సెమీకండక్టర్ల దృక్కోణంలో భారత్ మమ్మల్ని విలువైన భాగస్వామిగా పరిగణించడంపై మీకు నా కృతజ్ఞతలు’’ అన్నారు.

అనంతరం ‘కాడెన్స్’ సంస్థ ప్రెసిడెంట్/సీఈవో శ్రీ అనిరుధ్ దేవగణ్ మాట్లాడుతూ- భారతదేశం ఎట్టకేలకు సెమీకండక్టర్ల రంగంలో పెట్టుబడులు పెట్టడం హర్షణీయమన్నారు. అంతేకాకుండా మొత్తం పర్యావరణ వ్యవస్థకు ఈ పెట్టుబడులు విస్తరించడం ముదావహమని వ్యాఖ్యానించారు.

వేదాంత గ్రూప్ చైర్మన్ శ్రీ అనిల్ అగర్వాల్ మాట్లాడుతూ- ‘భారత సిలికాన్ వ్యాలీ’ రూపొందడానికి గుజరాత్ సముచిత ప్రదేశమని నిపుణులు భావిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశ యువతరానికి కొత్త అవకాశాలు సృష్టించాలనే ప్రధానమంత్రి దార్శనికత గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. ‘‘గడచిన దశాబ్ద కాలంలో భారత్ ఏ విధంగా రూపాంతరం చెందిందీ మేం ప్రత్యక్షంగా చూశాం. తదనుగుణంగా యువ భారతీయుల ఆకాంక్షలు నిజంగా ఎంతో ఉన్నతస్థాయిలో ఉన్నాయి’’ అని కొనియాడారు.

‘మైక్రాన్ టెక్నాలజీ’ సంస్థ ప్రెసిడెంట్/సీఈవో శ్రీ సంజయ్ మెహ్రోత్రా మాట్లాడుతూ- భారత ‘‘దేశాన్ని ప్రపంచ సెమీకండక్టర్ కూడలిగా మార్చడంపై ప్రధానమంత్రి అంతర్జాతీయ దృక్పథానికి ధన్యవాదాలు తెలిపారు. గుజరాత్‌లో సెమీకండక్టర్ల కూర్పు, మెమొరీ పరీక్ష సదుపాయాలను ఏర్పాటు చేయడం తమకెంతో గర్వకారణమని శ్రీ మెహ్రోత్రా పేర్కొన్నారు. రాబోయే కాలంలో ఈ ప్రాజెక్టుల రంగంలో 5,000 అదనపు ఉద్యోగాలతోపాటు దాదాపు 15,000 ఉద్యోగాలను సృష్టించగలదని చెప్పారు. రాష్ట్రంలో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే స్థిరమైన ఫలితాలు ఇవ్వగల నవ్యావిష్కరణలు, వ్యాపార వృద్ధి, సామాజిక ప్రగతితో కూడిన వాతావరణ సృష్టిని ప్రోత్సహించడంపై ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. ‘‘డిజిటల్ భారతం, భారత్‌లో తయారీ కార్యక్రమాలు పరివర్తనాత్మక శక్తిని ప్రోది చేస్తున్నాయి. సానుకూల ప్రగతికి ఇది చోదకం కాగలదనడంలో సందేహం లేదు’’ అని పేర్కొన్నారు.

ఫాక్స్‌కాన్ సంస్థ ఛైర్మన్ మిస్టర్ యంగ్ లియు మాట్లాడుతూ- తైవాన్ సెమీకండక్టర్ పరిశ్రమలో ‘సామూహిక స్ఫూర్తి’ (బఫెలో స్పిరిట్) గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. ఎలాంటి శషభిషలు లేకుండా కఠోరంగా శ్రమించగల సామర్థ్యానికి ప్రతీకగా దీన్ని పేర్కొనవచ్చునని చెప్పారు. ఇదే స్ఫూర్తిని భారతదేశానికీ వర్తింపజేయవచ్చునని అభిప్రాయపడ్డారు. భారత ప్రభుత్వ ‘చెప్పడం-చేయడం’ నిష్పత్తిస్థాయి ఉన్నతంగా ఉండటాన్ని మిస్టర్ లియు ప్రస్తావించారు. ఆ మేరకు చాలా ఏళ్ల కిందట తైవాన్ అనుసరించినట్లుగా ఆత్మవిశ్వాసంతో సవాళ్లను అధిగమించడం కోసం సమష్టి కృషికి ప్రభుత్వం ప్రాధాన్యమివ్వటాన్ని నొక్కిచెప్పారు. సెమీకండక్టర్ పరిశ్రమకు నాయకత్వం వహించగల మనే భారత ప్రభుత్వ ఆత్మవిశ్వాసం, సంకల్పంపై నమ్మకం-ఆశావాదం వ్యక్తం చేశారు. ‘‘ఐ-టీ అంటే ఇండియా-తైవాన్’’ అని మిస్టర్ లియు అభివర్ణించారు. అలాగే ప్రధాని వ్యాఖ్యలను ఉటంకిస్తూ- సెమీకండక్టర్ పరిశ్రమలో భారతదేశానికి తైవాన్ అత్యంత విశ్వసనీయ, ఆధారపడదగిన భాగస్వామిగా ఉంటుందని హామీ ఇచ్చారు.

అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ- సెమికాన్ వంటి కార్యక్రమాలు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ లాంటివని వ్యాఖ్యానించారు. వీటిలో నిపుణులు-పరిశ్రమలో అగ్రగాములు పరస్పరం కలుసుకుని, అనుభవాలను పంచుకుంటారని పేర్కొన్నారు. ‘‘మన సంబంధాల సమన్వయీకరణకు ఇదెంతో కీలకం’’ అని ప్రధాని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను శ్రీ మోదీ తిలకించారు. ఈ రంగం శక్తి సామర్థ్యాలను, ఆవిష్కరణలను గమనించి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రదర్శనను యువత సందర్శించి నవీన సాంకేతిక పరిజ్ఞానం శక్తిసామర్థ్యాలను అవగతం చేసుకోవాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు.

పోయినేడాది సెమికాన్ తొలి సంచికలో తాను పాల్గొనడాన్ని గుర్తుచేసుకుంటూ- భారత సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులపై వినిపించిన ప్రశ్నలను ప్రధాని ప్రముఖంగా ప్రస్తావించారు. అయితే, ‘‘భారత్‌లో ఎందుకు పెట్టుబడి పెట్టాలి?’ అనే ప్రశ్న ఏడాదిలోగానే ‘భారత్‌లో ఎందుకు పెట్టుబడి పెట్టకూడదు!’గా మారింది’’ అని వివరించారు. ‘‘పరిశ్రమలో అగ్రగాముల కృషితోనే ఈ దిశగా మార్పు సాధ్యమైంది’’ అన్నారు. ఈ మేరకు భారతదేశంపై వారు నమ్మకం ఉంచడాన్ని శ్రీ మోదీ అభినందించారు. భారత ఆకాంక్షలు-సామర్థ్యాన్ని పరిశ్రమ అగ్రగాములు తమ స్వీయ భవిష్యత్తుతో-కలలతో పెనవేశారని ఆయన అభివర్ణించారు. దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ ‘‘వారి ఆశాభావాన్ని భారతదేశం ఏమాత్రం నిరుత్సాహపరచదు’’ అని వ్యాఖ్యానించారు. ఈ 21వ శతాబ్దపు భారతదేశంలో అవకాశాలు పుష్కలమని శ్రీ మోదీ నొక్కిచెప్పారు. భారత ప్రజాస్వామ్యం, జనాభా, జనశక్తి లబ్ధితో దేశంలో వ్యాపారాలు ద్విగుణం-త్రిగుణంగా వృద్ధి చెందుతాయని ప్రకటించారు.

అసమాన వృద్ధిని సూచించే మూరే సిద్ధాంతం గురించి ప్రధాని ప్రస్తావిస్తూ- భారత డిజిటల్, ఎలక్ట్రానిక్ తయారీ రంగంలో అలాంటి అసమాన వృద్ధి నేడు మనకు ప్రత్యక్షంగా కనిపిస్తున్నదని పేర్కొన్నారు. అలాగే ప్రపంచ ఎలక్ట్రానిక్ తయారీ రంగంలో భారత్ వాటా అనేక రెట్లు పెరిగిందని ఆయన గుర్తుచేశారు. ఈ మేరకు 2014లో ఈ రంగం 30 బిలియన్ డాలర్ల స్థాయికన్నా దిగువన ఉండగా, నేడు 100 బిలియన్ డాలర్ల స్థాయిని అధిగమించిందని పేర్కొన్నారు. అంతేకాకుండా ఎలక్ట్రానిక్స్, మొబైల్ పరికరాల ఎగుమతులు గత రెండేళ్లలో రెట్టింపయ్యాయని తెలిపారు. భారతదేశంలో 2014 తర్వాతి సాంకేతిక పరిణామాలను ప్రస్తావిస్తూ- ఆనాడు (2014కు ముందు) దేశంలో కేవలం రెండు మొబైల్ తయారీ యూనిట్లు మాత్రమే ఉండేవని, నేడు వాటి సంఖ్య 200 దాటిందని ప్రధాని వివరించారు. దేశంలో బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారుల సంఖ్య 6 కోట్ల నుంచి 80 కోట్లకు చేరగా, ఇంటర్నెట్ కనెక్షన్ల సంఖ్య 25 కోట్ల నుంచి 85 కోట్లకు పెరిగిందని గుర్తుచేశారు. ఈ గణాంకాలు భారత పురోగతిని సూచించడమేగాక వ్యాపారాల వృద్ధిని సూచిస్తున్నాయని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. ఈ నేపథ్యంలో సెమికాన్ పరిశ్రమ అసమాన వృద్ధి లక్ష్యంలో భారత్ కీలక పాత్రను శ్రీ మోదీ నొక్కిచెప్పారు.

‘‘ప్రపంచంలో నేడు పరిశ్రమ 4.0 విప్లవం నడుస్తోంది’’ అని ప్రధాని వివరించారు. ప్రపంచంలో ఏ పారిశ్రామిక విప్లవానికైనా నిర్దిష్ట రంగంలోని ప్రజల ఆకాంక్షలే ప్రాతిపదిక అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. ‘‘గతంలో పారిశ్రామిక విప్లవాలకు, అమెరికా కలలకు అవినాభావ సంబంధం ఉండేది’’ అన్నారు. అయితే, ఇప్పుడు పరిశ్రమ 4.0 విప్లవం-భారతీయ ఆకాంక్షల మధ్య సారూప్యం ఏర్పడిందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఆ మేరకు భారత దేశాభివృద్ధికి భారతీయుల ఆకాంక్షలే చోదక శక్తి అని ఆయన పేర్కొన్నారు. దేశంలో దారిద్ర్యం వేగంగా తగ్గుతున్నదని, ఇది నయా-మధ్యతరగతి ఆవిర్భావానికి దారితీస్తున్నదని ఇటీవల ఓ నివేదిక పేర్కొనడాన్ని ఆయన ఉటంకించారు. దేశ ప్రజల సాంకేతికత సానుకూల స్వభావం, సాంకేతికత స్వీకరణలో వారి ఆసక్తిని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. చౌక డేటా, నాణ్యమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, గ్రామాలలో నిరంతర విద్యుత్ సరఫరా వంటివి డిజిటల్ ఉత్పత్తుల వినియోగాన్ని పెంచుతున్నాయని పేర్కొన్నారు. ‘‘ఆరోగ్యం, వ్యవసాయం లేదా రవాణా ఏదైనా కావచ్చు.. ఆధునిక సాంకేతికత వినియోగంపై భారత్ దృష్టి సారిస్తుంది’’ అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ప్రాథమిక గృహోపకరణాన్ని కూడా ఉపయోగించని వ్యక్తులు భారతదేశంలో ఉన్నప్పటికీ, నేడు అంతర సంధానిత స్మార్ట్ పరికరాలను వారు వాడుకోనున్నారని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా ఒక నిర్దిష్ట విద్యార్థి సమూహం లోగడ కనీసం సైకిల్ కూడా వాడి ఉండకపోయినా, నేడు స్మార్ట్ ఎలక్ట్రిక్ బైక్‌ల వినియోగానికి ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రధాని అన్నారు. ‘‘భారతదేశంలో పెరుగుతున్న నయా-మధ్యతరగతి భారతీయ ఆకాంక్షలకు శక్తి కేంద్రంగా మారింది’’ అని ప్రధానమంత్రి అన్నారు. చిప్ తయారీ పరిశ్రమ సమృద్ధ అవకాశాల మార్కెట్ అని ఆయన నొక్కిచెప్పారు. ఆ మేరకు ముందుగా అడుగుపెట్టినవారు ఇతరులకన్నా ముందంజలోగల ప్రయోజనాన్ని పొందగలరని విశ్వాసం వ్యక్తం చేశారు.

కోవిడ్ మహమ్మారి, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వంటివాటి దుష్ప్రభావాలను ప్రస్తావిస్తూ- ప్రపంచానికి విశ్వసనీయ సరఫరా గొలుసు అవసరమని ప్రధాని అన్నారు. ఇలాంటప్పుడు ‘‘ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారత దేశంకన్నా విశ్వసనీయ భాగస్వామి ఎవరుంటారు?’’ అని ఆయన వ్యాఖ్యానించారు. భారత్‌పై ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న నమ్మకంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ‘‘స్థిరమైన, బాధ్యతాయుత, సంస్కరణాత్మక ప్రభుత్వం ఉన్నందువల్లనే పెట్టుబడిదారులు భారతదేశాన్ని విశ్వసిస్తారు. ప్రతి రంగంలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందుతున్నందున పరిశ్రమ రంగానికి భారత్‌పై నమ్మకం పెరిగింది. అలాగే మనకు భారీ ప్రతిభా నిధి ఉన్నందున సెమీకండక్టర్ రంగం కూడా భారత్‌పై ఎనలేని విశ్వాసం ఉంచింది’’ అని ఆయన చెప్పారు. అదేవిధంగా ‘‘నిపుణులైన ఇంజనీర్లు, డిజైనర్లు మా బలం. ప్రపంచంలోగల అత్యంత శక్తిమంతమైన, ఏకీకృత మార్కెట్‌లో భాగం కావాలనుకునే ఏ దేశానికైనా భారత్‌పై నమ్మకం ఉంటుంది. మేక్ ఇన్ ఇండియా అని మేము మీతో అంటున్నామంటే- దేశం కోసమే కాకుండా ప్రపంచం కోసం కూడా తయారు చేయడమని అర్థం’’ అని ప్రధాని వివరించారు.

ప్రపంచంపట్ల భారతదేశం తన బాధ్యతలను అర్థం చేసుకుంటోందని, మిత్రదేశాలతో కలిసి సమగ్ర మార్గప్రణాళిక కోసం కృషి చేస్తున్నదని ప్రధానమంత్రి అన్నారు. అందుకే భారతదేశం శక్తిమంతమైన సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల ‘నేషనల్ క్వాంటం మిషన్’ ఆమోదించబడిందని, జాతీయ పరిశోధన ఫౌండేషన్ బిల్లును కూడా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నామని తెలిపారు. సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థను రూపొందించగల ఇంజనీరింగ్ పాఠ్యప్రణాళిక నవీకరించబడుతున్నదని చెప్పారు. సెమీకండక్టర్ల కోర్సులందించే 300కుపైగా ప్రముఖ కళాశాలలను గుర్తించినట్లు ప్రధాని తెలిపారు. ఇక ‘చిప్స్ టు స్టార్టప్’ కార్యక్రమం ఇంజనీర్లకు చేయూతనిస్తుందని చెబుతూ- ‘‘వచ్చే ఐదేళ్లలో మన దేశంలో లక్ష మందికిపైగా డిజైన్ ఇంజనీర్లు తయారవుతారని అంచనా. దేశంలో వృద్ధి చెందుతున్న అంకుర పర్యావరణ వ్యవస్థ సెమీకండక్టర్ రంగాన్ని కూడా బలోపేతం చేయనుంది’’ అని ఆయన అన్నారు.

శక్తి ఇన్సులేటర్ల ద్వారా కాకుండా కండక్టర్ల ద్వారా ప్రవహించే తరహాలోనే సెమీకండక్టర్ పరిశ్రమకు మంచి శక్తి వాహకంగా మారడానికి అనువైన ప్రతి అంశంలోనూ భారత్ ముందంజ వేస్తున్నదని ప్రధాని అన్నారు. ఈ రంగానికి విద్యుత్తు ఎంత కీలకమో వివరిస్తూ- గత దశాబ్దంలో భారత్ సౌరశక్తి స్థాపిత సామర్థ్యం 20 రెట్లకుపైగా పెరిగిందని గుర్తుచేశారు. దీంతోపాటు 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్య లక్ష్యాన్ని ఈ దశాబ్ది చివరికల్లా సాధించాలని నిర్ణయించుకున్నట్లు ప్రధానమంత్రి తెలిపారు. అలాగే సౌర పి.వి.మాడ్యూల్స్, హరిత ఉదజని, ఎలక్ట్రోలైజర్ల ఉత్పత్తి దిశగా చేపట్టిన కీలక చర్యలను కూడా ఆయన వివరించారు. దేశంలో చేపట్టిన విధాన సంస్కరణలు సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థ నిర్మాణంపై సానుకూల ప్రభావం చూపుతాయని ఆయన నొక్కిచెప్పారు. కొత్త ఉత్పాదక పరిశ్రమల కోసం అమలులోకి తెచ్చిన అనేక పన్ను మినహాయింపుల గురించి వెల్లడించారు. అలాగే భారత దేశంలో కార్పొరేట్ పన్ను అత్యంత స్వల్పమని తెలిపారు. ప్రత్యక్ష ప్రమేయంలేని పన్ను వసూలు విధానాలు, నిరంకుశ చట్టాల-విధానా రద్దు వంటివాటిని ఉదాహరించారు. వీటిద్వారా వాణిజ్య సౌలభ్యం కలగడంతోపాటు సెమీకండక్టర్ పరిశ్రమకు ప్రకటించిన ప్రత్యేక ప్రోత్సాహకాల గురించి వివరించారు. ఈ నిర్ణయాలు, విధానాలు దేశంలో సెమీకండక్టర్ పరిశ్రమకు ఎర్ర తివాచీ పరచిన వాస్తవాన్ని ప్రతిబింబిస్తున్నాయని శ్రీ మోదీ పేర్కొన్నారు. ‘‘భారతదేశం సంస్కరణల మార్గంలో ముందడుగు వేస్తున్నందున కొత్త అవకాశాల సృష్టితో సెమీకండక్టర్ పెట్టుబడులకు భారత్ అద్భుత కండక్టర్‌గా మారనుంది’’ అని ఆయన అన్నారు.

ప్రపంచ సరఫరా గొలుసు, ముడిసరుకు, సుశిక్షిత మానవ వనరులు, యంత్రాల అవసరాలను భారత్ అవగతం చేసుకుంటున్నదని ప్రధాని అన్నారు. ‘‘ప్రైవేట్ రంగ సంస్థలతో మా సంయుక్త కృషివల్ల ఆయా రంగాలు కొత్త ఎత్తులను తాకాయి. అది అంతరిక్ష రంగమైనా లేదా భౌగోళిక రంగమైనా, అన్నింటా మనకు అద్భుత ఫలితాలు వచ్చాయి’’ అని ప్రధాన మంత్రి ఉద్ఘాటించారు. వివిధ అంశాలపై అందిన అభిప్రాయాల ఆధారంగా తీసుకున్న కీలక నిర్ణయాలను కూడా ఆయన వెల్లడించారు. సెమికాన్ ఇండియా కార్యక్రమం కింద పెరిగిన ప్రోత్సాహకాల గురించి ఆయన వివరించారు. భారతదేశంలో సెమీకండక్టర్ల తయారీ కేంద్రాల ఏర్పాటు కోసం నేడు సాంకేతిక సంస్థలకు 50 శాతం ఆర్థిక సహాయం ఇవ్వబడుతున్నదని ఆయన తెలిపారు. ‘‘దేశంలో సెమీకండక్టర్ రంగం వృద్ధిని వేగిరపరచేందుకు మేం విధాన సంస్కరణలను నిరంతరం కొనసాగిస్తున్నాం’’ అని శ్రీ మోదీ చెప్పారు.

భారత జి-20 అధ్యక్షత ఇతివృత్తం ‘ఒకే భూమి-ఒకే కుటుంబం-ఒకే భవిష్యత్తు’ గురించి వివరిస్తూ- భారతదేశాన్ని సెమీకండక్టర్ల తయారీ కూడలిగా మార్చే లక్ష్యం వెనుకనున్న స్ఫూర్తి కూడా అదేనని ప్రధాని ఉద్ఘాటించారు. భారతదేశం తన నైపుణ్యం, శక్తిసామర్థ్యాల ద్వారా యావత్ ప్రపంచానికీ ప్రయోజనం కలగాలని భారత్ ఆకాంక్షిస్తున్నట్లు ఆయన ఉద్ఘాటించారు. అంతర్జాతీయ శ్రేయస్సు, మెరుగైన ప్రపంచం కోసం భారత సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఈ కృషిలో భాగస్వామ్యం, సూచనలు, ఆలోచనలను ప్రధాని ఆహ్వానించారు. అలాగే భారత ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలుస్తుందని పరిశ్రమ అగ్రగాములకు హామీ ఇచ్చారు. చివరగా- ఎర్రకోట బురుజుల నుంచి తన ప్రసంగాన్ని గుర్తుచేసుకుంటూ- ‘‘ఇదే తగిన సమయం? భారతదేశానికి మాత్రమే కాదు? యావత్ ప్రపంచానికీ ఇంతకుమించిన తరుణం లేదు’’ అని ప్రధానమంత్రి తన ప్రసంగం ముగించారు.

గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర పటేల్, కేంద్ర ఎలక్ట్రానిక్స్-సమాచార సాంకేతికత మంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్, సహాయ మంత్రి శ్రీ రాజీవ్ చంద్రశేఖర్సహా ‘కాడెన్స్’ సీఈఓ శ్రీ అనిరుధ్ దేవగణ్, ‘ఫాక్స్‌కాన్’ ఛైర్మన్ శ్రీ యంగ్ లియు, ‘వేదాంత’ ఛైర్మన్ శ్రీ అనిల్ అగర్వాల్, ‘మైక్రాన్’ సీఈవో శ్రీ సంజయ్ మెహ్రోత్రా, ‘ఎంఎడి’ సీటీవో మార్క్ పేపర్‌మాస్టర్, సెమీకండక్టర్ ప్రొడక్ట్ గ్రూప్ ‘ఎఎంఎటి’ అధ్యక్షుడు శ్రీ ప్రభు రాజా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సదస్సుకు ‘ఉత్ప్రేరకంగా భారత సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థ’ ఇతివృత్తం కాగా, పరిశ్రమలు, విద్యా-పరిశోధన సంస్థల నుంచి ప్రపంచ అగ్రగాములను ఒకే వేదికపైకి చేర్చడం దీని లక్ష్యం. ఇది భారత సెమీకండక్టర్ వ్యూహం, విధానాలను ప్రపంచానికి ప్రదర్శిస్తుంది. ఈ సదస్సు సెమీకండక్టర్ల రూపకల్పన, తయారీ, సాంకేతిక అభివృద్ధికి భారతదేశాన్ని ప్రపంచ కూడలిగా మారుస్తుంది. ‘సెమికాన్ఇండియా-2023’లో మైక్రాన్ టెక్నాలజీ, అప్లైడ్ మెటీరియల్స్, ఫాక్స్‌కాన్, ‘సెమి’ కాడెన్స్, ఎఎండి వంటి ప్రధాన కంపెనీల ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు

# త్వరలో 12లక్షల ఎకరాలకు విస్తరించనున్న టైగర్ జోన్.. మంత్రి పెద్దిరెడ్డి




తిరుపతి, జులై 29:రాష్ట్రంలో ఉన్న శ్రీశైలం - నాగార్జున సాగర్ టైగర్ జోన్ పరిధిని 12 లక్షల ఎకరాలకు విస్తరించడానికి కృషి జరుగుతోందని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రకటించారు. ఈరోజు ఉదయం స్థానిక ఎస్వీ జూపార్క్ లో గ్లోబల్ టైగర్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ? మన రాష్ట్రం పులుల సంరక్షణలో గణనీయంగా అభివృద్ధి సాధించిందని, శేషాచల, నల్లమల అభయారణ్యాలను కలుపుతూ కారిడార్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత 2010లో 45 పులులు నేడు రెట్టింపుతో 80కి పైగా వున్నాయన్నారు. పులులు పెరగడం వల్ల అటవీ సంపద దోచుకునే వారికి భయం వుంటుందని అన్నారు.

శేషాచల అభయారణ్యంలో నేడు పెద్ద పులులు లేవని, అయితే మామండూరు వద్ద గెస్ట్ హౌస్ నందు బ్రిటిష్ వారు వేటాడినట్లు రికార్డ్స్ చెబుతున్నాయని తెలిపారు. నల్లమల, శేషాచల అభయారణ్యాలు కలుపుతూ కారిడార్ ఏర్పాటుతో అటవీ సంరక్షణకు దోహదపడుతుందన్నారు. పులుల సంరక్షణకు రష్యాలోని జరిగిన సమావేశంలో బీజం పడిందని, ఆనాటి నుండి ప్రతీ ఏడాది జులై 29న గ్లోబల్ టైగర్ డే జరుపుకుంటున్నామన్నారు. గత 12సంవత్సరాల ముందు అటవీశాఖ మంత్రిగా ఉన్న సమయంలో పులుల లెక్కింపునకు శ్రీశైలంలో చిన్నపాటి లాబ్ పింగర్ ప్రింట్ ఆధారంగా చేసేవారని, ఇప్పుడు శాస్త్రీయంగా కచ్చితంగా లెక్కించడానికి స్టిల్, వీడియో, డ్రోన్ వంటి కెమెరాలు వున్నాయన్నారు. శ్రీశైలం నాగర్జునసాగర్ టైగర్ జోన్ ఇప్పుడు 8లక్షల ఎకరాల్లో వుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరో 5 లక్షల ఎకరాలు జోన్ పరిధి పెంచేలా ప్రతిపాదనలు చేశారన్నారు.

అనతి కాలంలోనే ఈ జోన్ ప్రముఖ స్థానంలో నిలుస్తుందన్నారు. ఎస్ ఎస్ టి ఆర్ పుస్తకం, పోస్టర్ ఆవిష్కరణ చేశారు. వివిధ వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, అటవీ సంరక్షణలో ప్రతిభ కనబరిచిన అటవీ అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ముందుగా ఎస్వీ జూపార్క్ లో పర్యాటకులకు కొత్తగా ఏర్పాటు చేసిన బజాజ్ బ్యాటరీ న్యూటర్ లను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అటవీ అధికారులు ఉపయోగించే ఆయుధాల స్టాల్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, రాష్ట్ర ముఖ్య అటవీ సంరక్షణధికారి మధుసూధన్ రెడ్డి, అదనపు సంరక్షణాధికారి శాంతిప్రియ పాండే, సీసీఎఫ్ నాగేశ్వర రావు, జూపార్క్ క్యూరేటర్ సి. సెల్వం, స్టేట్ సిల్వికల్చరిస్ట్ యశోదా బాయ్, తిరుపతి డిఎఫ్ఓ సతీష్ రెడ్డి, విద్యార్థులు, అటవీ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశ ఆర్థిక పురోగతిలో రసాయన మరియు పెట్రోకెమికల్ పరిశ్రమ కీలకం

న్యూఢిల్లీ, జులై 29:కేంద్ర వాణిజ్యం మరియు పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం ఴ ప్రజాపంపిణీ మరియు జౌళి శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక పురోగతిలో రసాయన మరియు పెట్రోకెమికల్ పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తుందని మరియు భవిష్యత్తులో వృద్ధికి కీలకమైన డ్రైవర్‌గా కొనసాగుతుందని భావిస్తున్నామని అన్నారు. న్యూఢిల్లీలో ‘ఇండియా: గ్లోబల్ కెమికల్స్ అండ్ పెట్రోకెమికల్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్స్’ (ఉఅఖఓఊ 2023) అనే అంశంపై జరుగుతున్న 3వ ఎడిషన్ సమ్మిట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ‘ఈలంలు - కనెక్టింగ్ ది వరల్డ్- వసుధైవ కుటుంబం- ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు’ అనే సెషన్‌లో ప్రసంగించారు. ఈ సందర్భంగా భారతదేశ ఆర్థిక వ్యవస్థ, ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థ మరియు ఉపాధి కల్పనకు రసాయన మరియు పెట్రో రసాయన పరిశ్రమల సహకారాన్ని శ్రీ గోయల్ ప్రశంసించారు.

ఎ గ ^ ం వ ం త ^ ం ల న ం పెంపొందించడంలో మరియు సమిష్టిగా బహుళ రంగాల వృద్ధిని ప్రోత్సహించడంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టిఎ) ముఖ్య పాత్ర పోషిస్తాయని మంత్రి అన్నారు. రసాయనాలు మరియు పెట్రోకెమికల్స్ పరిశ్రమలో వాణిజ్యం, పెట్టుబడులు మరియు సహకారాన్ని ఎఫ్‌టిఎలు సులభతరం చేసే మార్గాలను అన్వేషించడానికి జిసిపిఎంహెచ్ 2023 సమ్మిట్ ఒక వేదికగా పనిచేస్తుందని ఆయన అన్నారు.

ఈ కీలక రంగం యొక్క పోటీతత్వం మరియు సుస్థిరతను పెంపొందించడానికి ఎఫ్‌టిఎలను ప్రభావితం చేయడంపై చర్చించడానికి మరియు ఆలోచనలను మార్పిడి చేసుకోవడానికి పరిశ్రమల నాయకులు, విధాన రూపకర్తలు మరియు నిపుణుల కోసం ఒక వేదికను అందించినందుకు ఉఅఖఓఊ 2023ని శ్రీ గోయల్ ప్రశంసించారు. భారతదేశ రసాయన మరియు పెట్రో రసాయన పరిశ్రమలలోకి విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో ఎఫ్‌టిఎలు సహాయపడతాయని ఆయన అన్నారు. ఇది కొత్త ఉద్యోగాల కల్పనకు మరియు కొత్త మౌలిక సదుపాయాల అభివృద్ధికి దారితీస్తుందని, ప్రపంచంతో కనెక్ట్ అయ్యే పరిశ్రమ సామర్థ్యాన్ని బలోపేతం చేస్తుందని ఈ సందర్భంగా మంత్రి హైలైట్ చేశారు.

అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడానికి మన లక్ష్యంలో స్థిరత్వం యొక్క ప్రాముఖ్యతను శ్రీ పీయూష్ గోయల్ హైలైట్ చేశారు. భవిష్యత్ తరానికి సుస్థిరమైన భారతదేశాన్ని సృష్టించడం ప్రస్తుత తరానికి ఎంత ముఖ్యమో కూడా ఆయన పేర్కొన్నారు. స్థిరమైన పద్ధతులను ప్రోత్సహించడానికి మరియు స్థిరమైన పరిష్కారాలను కనుగొనడంలో నిబద్ధతను ప్రోత్సహించడానికి అందరు వాటాదారుల కృషి మరియు అంకితభావాన్ని మంత్రి ప్రశంసించారు.

ఉత్తమ అభ్యాసాలను పంచుకోవడం మరియు సహకారాన్ని పెంపొందించడం నిస్సందేహంగా రసాయన మరియు పెట్రోకెమికల్ పరిశ్రమలలో మరింత స్థిరమైన మరియు సంపన్నమైన భవిష్యత్తుకు మార్గం సుగమం చేస్తుందని ఆయన అన్నారు. రాబోయే తరాల పట్ల విధి, నిబద్ధతతో పని చేయాలని శ్రీ గోయల్ ప్రస్తుత తరం ప్రజలను కోరారు. అతను మహాత్మా గాంధీని ఉటంకిస్తూ, ‘‘మనమందరం తరువాతి తరానికి ధర్మకర్తలుగా భూమిని వారసత్వంగా అందించాలి’’ అని అన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి - జిల్లా కలెక్టర్ అర్.వి.కర్ణన్..



నల్గొండ, జులై 29: జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అర్. వి. కర్ణన్ అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్ర ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రి లో కలియ తిరుగుతూ వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి లో తొలుత ఎమర్జెన్సీ వార్డ్ ను సందర్శించారు. తదుపరి పోలియేటివ్ కేర్ విభాగం సందర్శించి అక్కడి రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు సరిగా అందుతున్నాయా, మందులు ఇస్తున్నారా, ఎన్ని రోజులు నుండి ఆసుపత్రిలో ఉన్నారు లాంటి తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలియెటివ్ కేర్ యూనిట్ లో డాక్టర్ రోగులకు అందు బాటులో ఉంటూ రోగులను ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తూ వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ను ఆదేశించారు.

అలాగే జిల్లాలో ఉన్న క్యాన్సర్ రోగుల గురించి , వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి డాక్టర్ లను ఆరా తీశారు. మండల పీ హెచ్ సీ ల వారీగా పోలియేటివ్ కేర్ రోగుల జాబితా అందించాలని ఆదేశించారు. ఎంత మంది దీర్ఘ కాలిక రోగులు ఉన్నారు, వారికి అందిస్తున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత మేల్ మెడికల్ వార్డ్ ను సందర్శించారు. డయాలసిస్ యూనిట్ లో రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులు బయట నుండి మందులు తెచ్చుకుంటున్నామని చెప్పడంతో ఆయన అక్కడి వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సదరు రోగులకు ఆసుపత్రి లోనే మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎంసీ హెచ్ వార్డ్ ప్రసూతి గదులు, అంటి నాటల్ పరీక్ష గది, లేబర్ రూం లు, ఆపరేషన్ థియేటర్లను కలెక్టర్ పరిశీలించారు. రోజుకు ఎన్ని డెలివరీ లు జరుగుతున్నాయని వివరాలు అడిగారు. కాగా మే లో 601,జూన్ నెలలో 534 డెలివరీ లు జరిగాయని అక్కడి వైద్యులు తెలిపారు. అంతే కాకుండా ఏరియా ఆసుపత్రుల్లో కూడా మౌలిక సదుపాయాలు కల్పించి అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు సిద్ధం చేసినట్లు చేసినట్లు కలెక్టర్ ఈ సందర్భంగా వెల్లడించారు. జిల్లా కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లచ్చు నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండల్ రావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ మాతృ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వేణు గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.


కవన మిత్ర
సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ
నాగారం,మం:కీసర
మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా



డా. తిరునగరి స్మారక సాహిత్య పురస్కారాలు -2023
భారత్ భాషాభూషణ్,కవితిలక,తెలంగాణాప్రభుత్వ దాశరథి అవార్డు గ్రహీత,డా.తిరునగరి గారి జయంతి (సెప్టెంబర్24)సందర్భంగా కవనమిత్ర సాహిత్య సేవా సంస్థ సాహితీ అవార్డులు ఇవ్వడానికి సంకల్పించింది.
ఎంపికైన వచన కవిత్వం మరియు పద్య కవితా సంకలన రచయితలకు ఒక్కొక్కరికి *5,116* రూపాయల నగదు పురస్కారంతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేయడం జరుగుతుంది.
రచయితలు 2022 సంవత్సరంలో ప్రచురితమైన కవితా సంకలనాలను 3చొప్పున,హామీ పత్రం జత చేసి *జూలై31*వ తేదీ లోపు పంపించాలి.
రచనలు పంపవలసిన చిరునామా:
పెసరు లింగారెడ్డి,
ఇంటి నం:10-650/1
రవీంద్ర నగర్, *నాగారం* ,
కీసర మండలం,మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా,500083.
మొబైల్:9010292500


# భద్రకాళి చెరువుకు గండితో ప్రమాదం లేదు.. అన్ని జాగ్రతలు చేపట్టాం.. సీపీ రంగనాథ్




వరంగల్, జులై 29: వరంగల్ నగర నడిబొడ్డున గల భద్రకాళి చెరువుకు గండి పడడం వల్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరమేమి లేదని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవి రంగనాథ్ స్పష్టం చేశారు. గండి పడిన ప్రాంతాన్ని జిల్లా అధికార యంత్రాంగంతో పాటు వరంగల్ పోలీస్ కమిషనర్ పరిశీలించారు. సిపి రంగనాథ్ మీడియాతో మాట్లాడుతూ? భద్రకాళీ చెరువుకు గండి పడిందని ప్రజలు కలవరపడాల్సిన అవసరమేమి లేదన్నారు. చెరువు దిగువ ప్రాంతాలకు కూడా ప్రమాదేమేమి ఉండదన్నారు. అయితే ముందు జాగ్రత్త చర్యగా మాత్రమే సమీప కాలనీలను ప్రజలను ఖాళీ చేయిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్టు చెప్పారు. చెరువుకు పడ్డ గండి కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా అన్నీ పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. వరద ఉధృతి తగ్గించేందుకు ఎగువ ప్రాంతాల నుండి వస్తున్న నీటిని దారి మళ్లించే చర్యలతో పాటు నిలిపి వేయించే చర్యలు తీసుకుంటున్నట్లు వరంగల్ సీపీ వివరించారు. ఇప్పటికైతే ప్రమాదేమమి లేదని తేల్చి చెప్పారు. అయినప్పటికీ చెరువు పరిసర ప్రాంతాల్లో పోలీసుల పర్యవేక్షణ జరుపుతున్నారని, డ్రోన్ ల ద్వారా కలెక్టర్ కూడా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వరంగల్ సీపీ రంగనాథ్ తెలిపారు.

# శాస్త్రవేత్తల సంయుక్త యాత్రకు విజయవంతమైన ముగింపు - కొలంబో సెక్యూరిటీ కాన్క్లేవ్

న్యూఢిల్లీ, జులై 29:భారతదేశం, బంగ్లాదేశ్ మరియు మారిషస్ నుండి సముద్ర శాస్త్రవేత్తల సంయుక్త యాత్రను ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఐఎన్‌సిఓఐఎస్), కొలంబో సెక్యూరిటీ కాన్క్లేవ్ (సిఎస్‌సి)కు చెందిన ప్రాంతీయ ఫ్రేమ్‌వర్క్‌లో మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ నిర్వహించింది. 24 జులై 2023న ఇది ముగిసింది. హిందూ మహాసముద్రానికి చెందిన ప్రాంతీయ వాతావరణంలో మార్పులను అంచనా వేయడానికి మరియు నిర్వహించడానికి సముద్ర డేటా సేకరణ మాత్రమే కాకుండా సముద్ర పరిశీలన మరియు సేవలలో సామర్థ్యాన్ని పెంపొందించడం ఈ యాత్ర లక్ష్యం.

ఓఆర్‌వి సాగర్ నిధి ఆన్‌బోర్డ్ సాహసయాత్ర ప్రత్యేకమైనది. ఎందుకంటే ఇది సిఎస్‌సి ఫ్రేమ్‌వర్క్‌లో మొదటిది; దీనిలో పాల్గొనేవారు సముద్ర పారామితుల కొలత మరియు మోడలింగ్ వంటి సహకార కార్యకలాపాలను చేపట్టారు. ఇది ఈ ప్రాంతంలోని అందరి ఉమ్మడి ప్రయోజనం కోసం మెరుగైన సూచన మరియు సేవలకు దారి తీస్తుంది.

బంగ్లాదేశ్ ఓషనోగ్రాఫిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (బిఓఆర్ఐ) నుండి యాత్రలో పాల్గొన్న శాస్త్రవేత్త ఎండీ సిముల్ భుయాన్ తన అనుభవాలను పంచుకుంటూ" ఓషన్ రీసెర్చ్ వెసెల్ సాగర్ నిధిలో పరిశోధనా యాత్ర నాకు మొదటి అనుభవం. నేను ఫిషింగ్ బోట్‌లు మరియు కంట్రీ బోట్‌లలో పనిచేసినందున, ఇంత అధునాతన పరిశోధనా నౌకలో పనిచేసిన అనుభవం నాకు ఎప్పుడూ లేదు. వాతావరణం చాలా కఠినంగా ఉన్నప్పటికీ, నాకు కొన్ని అద్భుతమైన అనుభవాలు మరియు అభ్యాసాలు ఉన్నాయి. శాస్త్రవేత్తలు మరియు సిబ్బంది అందరూ చాలా సపోర్ట్ చేశారు. డాక్టర్ గిరీష్‌కుమార్‌తో కలిసి పని చేయడం చాలా సౌకర్యంగా అనిపించింది. ఈ పరిశోధన క్రూయిజ్ నాకు జీవితకాల జ్ఞాపకం మరియు అనుభవం అవుతుంది" అని తెలిపారు.

మారిషన్ ఓషనోగ్రఫీ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన శాస్త్రవేత్త మురుఘేన్ సాడియన్ తన అనుభవాలను పంచుకుంటూ ఇలా అన్నారు: భౌతిక సముద్ర శాస్త్రవేత్తగా, ప్రధానంగా తీరప్రాంతాలలో నైపుణ్యం కలిగిన వ్యక్తిగా ఇన్‌కాయిన్ బృందంతో ఓఆర్‌వి సాగర్ నిధి యొక్క ఈ సాహసయాత్ర నా ప్రస్తుత పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి నాకు సహాయపడింది. లోతైన సముద్ర ప్రక్రియల యొక్క ఉత్సుకత మరియు వర్టికల్ మైక్రోస్ట్రక్చర్ ప్రొఫైలర్ (విఎంపి) మరియు లోయర్డ్ ఎకౌస్టిక్ డాప్లర్ కరెంట్ ప్రొఫైలర్ (ఎల్ఏడిసిపి) ఉపయోగించి బహిరంగ మరియు తీర సముద్రంలో వివిధ చిన్న స్థాయి మిక్సింగ్ ప్రక్రియల ప్రాముఖ్యత ఉంది. సంగ్రహంగా చెప్పాలంటే ఈ సాహసయాత్ర ఫలవంతమైంది, ఎందుకంటే ఇది డేటా సేకరణలో కొత్త సాంకేతికతలను పొందడంలో అలాగే సాహసయాత్ర రూపకల్పనలో నాకు సహాయపడింది. జోఫియా, అభిజీత్ మరియు ముఖ్యంగా డాక్టర్ గిరీష్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు, ఈ సర్వే యొక్క సిద్ధాంతం మరియు ప్రాముఖ్యత గురించి విలువైన వివరణలు ఇచ్చారు." అని చెప్పారు.

తొలి సిఎస్‌సి ఓషనోగ్రాఫర్స్ జాయింట్ ఎక్స్‌పెడిషన్‌ను పూర్తి చేసిన తర్వాత ఇన్‌కొయిస్ డైరెక్టర్ డాక్టర్ టి.శ్రీనివాస కుమార్ మాట్లాడుతూ " అరేబియా సముద్రంలోని సముద్ర మరియు వాతావరణ స్థితి భారతదేశం మరియు సమీపంలోని భూభాగంపై రుతుపవనాల ప్రాదేశిక మరియు తాత్కాలిక వైవిధ్యాన్ని గుర్తించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అయినప్పటికీ వేసవి రుతుపవనాల గరిష్ట సమయంలో అరేబియా సముద్రంలో సముద్ర మరియు వాతావరణ స్థితిని నిర్ణయించే చిన్న-స్థాయి అల్లకల్లోల మిక్సింగ్ ప్రక్రియల పాత్ర స్పష్టంగా అర్థం కాలేదు. ఒక నెలపాటు సాగే ఈకెఏఎంఎస్ఏటి (సైన్స్ మరియు అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ద్వారా అరేబియా సముద్రపు సముద్ర పర్యావరణంపై నాలెడ్జ్‌ని పెంపొందించడం)లో భాగంగా ఇన్‌కొయిస్ నేతృత్వంలోని సాగర్ నిధిలో విహారయాత్ర, భారతదేశంలోని ఇన్‌కొయిస్ నుండి శాస్త్రవేత్తలు; ఎంఓఐ, మారిషన్ మరియు బిఓఆర్ఐ, బంగ్లాదేశ్ కలిసి వర్టికల్ మైక్రోస్ట్రక్చర్, ఎడ్డీ కోవియారిన్స్ ఫ్లక్స్ కొలతలు, ఎల్-ఏడిసిపి, అండర్‌వే సిడిటి(అండర్‌వే కండక్టివిటీ-టెంపరేచర్-డెప్త్ ఇన్‌స్ట్రుమెంట్) మరియు రేడియోసన్‌డ్ సమయంలో ఫైన్-స్కేల్ స్కేల్ రిజల్యూషన్‌లో విలువైన సముద్ర శాస్త్ర మరియు వాతావరణ డేటాను సేకరించడానికి కలిసి పనిచేశాయి. ఈ డేటా అరేబియా సముద్రంలో వేసవి రుతుపవనాల సమయంలో చిన్న-స్థాయి మిక్సింగ్ మరియు వాతావరణ సరిహద్దు పొర డైనమిక్స్ పట్ల ఖచ్చితంగా కొత్త అంశాలను అందిస్తుంది" అని అభిప్రాయపడ్డారు.

# వృద్ధులకు ప్రత్యేక అవసరాల పింఛనుకు సంబంధించి 2019లో ఉపసంహరించుకున్న కేసులను తిరిగి తెరవడం లేదు: రక్షణ మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, జులై 29:రక్షణ మంత్రిత్వ శాఖ (ఎంవోడీ), తాను ఉపసంహరించుకున్న పాత కేసులను తిరిగి తెరిచిందంటూ వచ్చిన వార్తలో వాస్తవం లేదు, అది తప్పుదారి పట్టించేలా ఉంది. 2019 ప్రారంభంలో ఉపసంహరించుకున్న ప్రత్యేక అవసరాల పింఛను కేసుల్లో ఎంవోడీ ఎలాంటి వ్యాజ్యం దాఖలు చేయలేదు. ప్రభుత్వ విధానం, సుప్రీంకోర్టు ఆదేశాల ద్వారా పరిష్కారమైన సమస్యల ఆధారంగా దిగువ కోర్టులు/ట్రైబ్యునళ్లు ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వ లిటిగేషన్ పాలసీ ప్రకారం ఎంవోడీ అంగీకరిస్తుంది. చాలా కాలం క్రితం నాటి కేసుల్లో ట్రిబ్యునల్ ఆదేశాలను అమలు చేయడం కూడా జరిగింది.

సర్వోన్నత న్యాయస్థానం తాజా తీర్పుల ప్రకారం, సైనిక విధుల్లో అయిన గాయం/వైకల్యం 'ఆపాదించకూడదు లేదా తీవ్రతరం కాదు' (నానా) అని వైద్య బోర్డులు స్పష్టంగా చెప్పిన సందర్భాల్లో మాత్రమే, ప్రభుత్వ సీనియర్ న్యాయ అధికారుల సలహా తీసుకుని ఎంవోడీ అప్పీల్ చేసింది. సైనిక విధుల్లో కలిగే గాయం/వైకల్యం విషయంలో ఎంవోడీ సున్నితంగా ఉంటుంది, వీర సైనికులకు అండగా నిలుస్తుంది. కేంద్ర ప్రభుత్వ విధానాల ప్రకారం వారికి ఉత్తమ ఫలితం అందజేయడానికి ప్రయత్నిస్తుంది.

# ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌కు విశేష స్పందన-మంత్రి వేముల



నిజామాబాద్, జులై 29:ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ కు యువత నుండి విశేష స్పందన వచ్చిందని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. బాల్కొండ నియోజకవర్గ యువతీ యువకుల కోసం ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించే కార్యక్రమంలో భాగంగా వేల్పూర్ మార్కెట్ కమిటి ప్రాంగణంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన స్లాట్ బుకింగ్, లెర్నింగ్ లైసెన్స్ అందజేసే ఆర్టీవో ఎక్సటెన్షన్ ఆఫీస్ సెంటర్ ను మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శనివారం ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్లు, స్లాట్ బుకింగ్ సిస్టమ్, లైసెన్స్ జారీ చేసే ప్రక్రియను పరిశీలించారు. అందుకు సంబంధించిన వివరాలు అధికారులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్లాట్ బుకింగ్ కోసం వచ్చిన యువకులతో మంత్రి ముచ్చటించారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ బాల్కొండ నియోజకవర్గంలో త్వరలో పర్మినెంట్ ఆర్టీవో ఎక్సటెన్షన్ ఆఫీస్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని మంత్రి అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కోసం ఆర్మూర్ కు వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నదని నియోజకవర్గంలోని దూర ప్రాంతాల మండలాల ప్రజలకు అది అసౌకర్యంగా ఉందన్నారు. అందుకే బీఆర్ఎస్ తరపున సొంత ఖర్చులతో ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ డ్రైవ్ చేపట్టామని తెలిపారు. బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోంచి ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ కు యువత నుండి విశేష స్పందన వస్తోందని, ఇప్పటికే సుమారు 7వేల మంది యువకులు లైసెన్స్ కోసం అప్లై చేసుకున్నారని తెలిపారు. ఆర్మూర్ ఆర్టీవో ఆఫీస్ వెళ్లే ఇబ్బందులు లేకుండా వేల్పూర్ లోనే ఎక్సటెన్షన్ ఆఫీస్ ఏర్పాటు చేసుకున్నామన్నారు. బాల్కొండ నియోజకవర్గానికి ఆర్టీవో ఎక్స్ టెన్షన్ కార్యాలయం కావాలని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ను అడిగిన మూడు గంటల్లోనే దానికి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారన్నారు. రవాణా శాఖ మంత్రికి నియోజకవర్గ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

ఆయా గ్రామాల వారీగా స్లాట్ బుకింగ్ షెడ్యూల్

అప్లై చేసుకున్న యువత ఒకే రోజు వచ్చి ఇబ్బందులు పడకుండా ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకుల ద్వారా, సోషల్ మీడియా ద్వారా ఏరోజు ఏయే గ్రామాల యువత రావాలో చెప్తామని, దీంతో ఎవరికీ అసౌకర్యం లేకుండా ఉంటుందన్నారు. ప్రతి రోజు 400 నుండి 500 వరకు స్లాట్ బుకింగ్ జరిగే అవకాశం ఉన్నందున అదే రోజు వారికి లెర్నింగ్ లైసెన్స్ జారీ చేసే అవకాశం కల్పించాలని జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారికి మంత్రి సూచించారు. దీంతో దూర ప్రాంత గ్రామాల నుండి వచ్చే వారికి మళ్ళీ మళ్ళీ తిరగకుండా ఉపయుక్తంగా ఉంటుందన్నారు. వేల్పూర్ లో ఎక్స్ టెన్షన్ ఆఫీస్ ఏర్పాటుకు రవాణా శాఖ అధికారులు వేగంగా స్పందించారని వారికి మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. లైసెన్స్ లేదని పోలీసు చెకింగ్ లు తప్పించుకోవడానికి గల్లిల్లో, రోడ్ మీద స్పీడ్ గా వెళ్లి యువత ప్రమాదాలకు గురయ్యే ఆస్కారం ఇక నుండి తప్పుతుందని, దర్జాగా జేబులో లైసెన్స్ తో వెళ్ళొచ్చని చమత్కరించారు.

నూతనంగా డ్రైవింగ్ లైసెన్స్ అందుకోబోయే యువతీ యువకులకు ఈ సందర్భంగా మంత్రి వేముల శుభాకాంక్షలు తెలిపారు.

# జనరిక్ మందులు రాయాలని వైద్యులకు సూచన

న్యూఢిల్లీ, జులై 29:భారత వైద్య మండలి (వృత్తిపర నడవడిక, మర్యాద, నీతి) నిబంధనలు-2002లోని 1.5 నిబంధన ప్రకారం, ప్రతి వైద్యుడు జనరిక్ పేర్లతో ఔషధాలను స్పష్టంగా, పెద్ద అక్షరాలతో రాయాలి. ఆ మందులను హేతుబద్ధంగా వినియోగించేలా చూడాలి. గతంలోని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) 22.11.2012, 18.01.2013, 21.04.2017 తేదీల్లో జారీ చేసిన ఆదేశాల ప్రకారం, రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్లందరూ పైన చెప్పిన నిబంధనలు పాటించాలి.

పైన చెప్పిన నిబంధనలు ఉల్లంఘించిన వైద్యునిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర వైద్య మండళ్లు లేదా జాతీయ వైద్య కమిషన్ 'ఎథిక్స్ అండ్ మెడికల్ రిజిస్ట్రేషన్ బోర్డు'కు (ఈఎంఆర్‌బీ) జాతీయ వైద్య కమిషన్ చట్టం-2019 అధికారం ఇచ్చింది. నైతిక నియమావళి ఉల్లంఘించారని వైద్యునిపై ఫిర్యాదులు వస్తే, ఆ ఫిర్యాదులను ఈఎంఆర్‌బీ (గతంలో ఎంసీఐ ద్వారా) ద్వారా, సంబంధిత రాష్ట్ర వైద్య మండళ్లకు పంపుతారు. జనరిక్ ఔషధాల ప్రిస్క్రిప్షన్లు ఉండేలా నిర్ధారించుకోవాలని, ప్రజారోగ్య కేంద్రాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని రాష్ట్రాలకు సూచించడం జరిగింది.

ప్రజలందరికీ తక్కువ ధరలకు జనరిక్ ఔషధాలు అందేలా చూడడానికి, దేశంలోని అన్ని జిల్లాల్లో 9,600కు పైగా ప్రధాన మంత్రి భారతీయ జనౌషధి కేంద్రాలు (పీఎంబీజేకే) ఏర్పాటయ్యాయి. 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్ /ఫార్మాస్యూటికల్స్ ఉ మెడికల్ డివైసెస్ బ్యూరో ఆఫ్ ఇండియా' (పీఎంబీఐ), ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియా, ఇతర ప్రకటనల ద్వారా ఈ పథకం గురించి అవగాహన కల్పిస్తోంది. దీంతోపాటు, జన్ ఔషధి జనరిక్ ఔషధాల ప్రయోజనాలు, పథకం గురించిన సమాచారాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తుంది. జనౌషధి సుగం అనే మొబైల్ అప్లికేషన్‌ను కూడా పీఎంబీఐ తీసుకొచ్చింది. వినియోగదార్లు తమ సమీపంలోని పీఎంబీజేకేని గుర్తించడం, జనౌషధి మందులు, టెలిఫోన్ నంబర్లు మొదలైనవాటిని ఈ అప్లికేషన్ ద్వారా తెలుసుకోవచ్చు. ఈ పథకాన్ని మరింత వ్యాప్తి చేయడానికి, అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం మార్చి 7న జన్ ఔషధి దివస్ జరుపుకుంటారు. ప్రజారోగ్య కేంద్రాలకు అవసరమైన జనరిక్ ఔషధాలను ఉచితంగా అందించడానికి జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద మద్దతు అందిస్తున్నారు. ఉచిత ఔషధ సేవ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేలా వివిధ కార్యక్రమాలకు కూడా ఈ మద్దతు అందుతుంది. అవి, పటిష్టమైన సేకరణ వ్యవస్థలను బలోపేతం చేయడం/ఏర్పాటు చేయడం, నాణ్యత హామీ, 'సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్' (సీడీఏసీ) ద్వారా అభివృద్ధి చేసిన 'డ్రగ్స్ అండ్ వ్యాక్సిన్స్ డిస్ట్రిబ్యూషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ (డీవీడీఎంఎస్) వంటి ఐటీ-ఆధారిత సరఫరా గొలుసు నిర్వహణ వ్యవస్థలు, గిడ్డంగులు, ప్రిస్క్రిప్షన్ తనిఖీలు, ఫిర్యాదుల పరిష్కారం, సమాచారం, విజ్ఞానం ఉ సమాచార పంపిణీ (ఐఈసీ), శిక్షణ.కేంద్ర ఆరోగ్య ఉ కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ ఈ రోజు లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం రూపంలో ఈ సమాచారం అందించారు.

# గ్రామీణ ఆరోగ్య సంరక్షణను బలోపేతం చేసేందుకు చర్యలు

న్యూఢిల్లీ, జులై 29:సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను అందించడానికి ఇప్పటికే ఉన్న సబ్ హెల్త్ సెంటర్స్(ఎస్హెచ్సీ)లు మరియు ప్రైమరీ హెల్త్ సెంటర్స్(పీహెచ్సీ)లను అప్‌గ్రేడ్ చేయడం ద్వారా భారతదేశంలో మొత్తం 1,60,480 ఆయుష్మాన్ భారత్ - హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లు నిర్వహించబడ్డాయి.

దేశంలోని ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ భారతదేశంలో ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ యొక్క మూడు స్తంభాలుగా సబ్ హెల్త్ సెంటర్ (గ్రామీణ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పట్టణ మరియు గ్రామీణ) మరియు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (అర్బన్ మరియు రూరల్)తో మూడు-స్థాయిల్లో వ్యవస్థలను కలిగి ఉంటుంది.

వ్యవస్థాపక నిబంధనల ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో 5,000 (సాధారణ) మరియు 3000 (కొండలు మరియు గిరిజన ప్రాంతంలో) జనాభాకు ఉప ఆరోగ్య కేంద్రం, 30,000 (సాధారణ) మరియు 20,000 (కొండలు మరియు కొండ ప్రాంతాలలో) జనాభాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు 1,20,000 (సాధారణ) మరియు 80,000 (కొండలు మరియు గిరిజన ప్రాంతంలో) జనాభా కోసం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూచించబడింది. అంతేకాకుండా పట్టణ ప్రాంతం కోసం 15,000 నుండి 20,000 పట్టణ జనాభా కోసం ఒక అర్బన్ హెల్త్ వెల్నెస్ సెంటర్ సిఫార్సు చేయబడింది, 30,000 నుండి 50,000 పట్టణ జనాభాకు ఒక అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, నాన్-మెట్రో నగరాల్లో ప్రతి 2.5 లక్షల జనాభాకు ఒక అర్బన్కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సిఫార్సు చేయబడింది. మెట్రో నగరాల్లో ప్రతి 5 లక్షల జనాభాకు ఒక అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించబడింది. అంతేకాకుండా మొదటి రెఫరల్ యూనిట్, సబ్-డిస్ట్రిక్ట్ హాస్పిటల్ (ఎస్డీహెచ్) మరియు డిస్ట్రిక్ట్ హాస్పిటల్ (డీహెచ్) గ్రామీణ ఉ పట్టణ ప్రాంతాలకు సెకండరీ కేర్ సేవలను అందిస్తాయి.

గ్రామీణ ఆరోగ్య గణాంకాలు (ఇర్హెచ్ఎస్) అనేవి రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు నివేదించిన హెల్త్ కేర్ అడ్మినిస్ట్రేటివ్ డేటా ఆధారంగా వార్షిక ప్రచురణ. గ్రామీణ ఉ పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న రాష్ట్ర/కేంద్ర పాలిత ప్రాంతాల వారీగా సబ్-సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, సబ్-డివిజనల్ హాస్పిటల్, డిస్ట్రిక్ట్ హాస్పిటల్ ఉ మెడికల్ కాలేజీల వివరాలతో పాటు గ్రామీణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని సగటు జనాభా వివరాలతో పాటుగా కింది వాటిలో చూడవచ్చు.

జాతీయ ఆరోగ్య మిషన్ (నేషనల్ హెల్త్ మిషన్) ప్రజల అవసరాలకు జవాబుదారీగా మరియు ప్రతిస్పందించే సమానమైన, సరసమైన ఉ నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలకు సార్వత్రిక ప్రాప్యతను సాధించాలని భావిస్తుంది. ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ జాతీయ ఆరోగ్య మిషన్ కింద ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ ప్లాన్స్ (పీఐపీలు) రూపంలో అందిన ప్రతిపాదనల ఆధారంగా ప్రజారోగ్య సంరక్షణ వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలకు సాంకేతిక మరియు ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. నిబంధనలు మరియు అందుబాటులో ఉన్న వనరుల ప్రకారం రికార్డ్ ఆఫ్ ప్రొసీడింగ్స్ రూపంలో ప్రతిపాదనలకు భారత ప్రభుత్వం ఆమోదం తెలుపుతుంది.

24.07.2023 నాటికి, మొత్తం 1,60,480 ఆయుష్మాన్ భారత్ ? హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లు (ఏబీహెచ్డబ్ల్యూసీలు) భారతదేశంలో ఇప్పటికే ఉన్న సబ్హెల్త్సెంటర్లు మరియు ప్రైమరీ హెల్త్ సెంటర్లను అప్‌గ్రేడ్ చేయడం ద్వారా సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ (సీపీహెచ్సీ)ని అందించడం ద్వారా నివారణ, ప్రోత్సాహక, ఉపశమన మరియు పునరావాస సేవలు సార్వత్రికమైనవి. ఈ సేవలు ఉచితంగా అందించడంతోపాటు నివాసాలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేస్తారు.

పదిహేనవ ఆర్థిక సంఘం (ఎఫ్సీఎఫ్సీ) ఆరోగ్య రంగంలోని నిర్దిష్ట భాగాల కోసం స్థానిక ప్రభుత్వాల ద్వారా రూ. 70,051 కోట్ల గ్రాంట్‌లను సిఫార్సు చేసింది. దానిని కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. స్థానిక ప్రభుత్వాల ద్వారా ఆరోగ్యానికి సంబంధించిన ఈ గ్రాంట్లు 2021?-22 ఆర్థిక సంవత్సరం నుండి 2025-26 ఆర్థిక సంవత్సరం వరకు ఐదేళ్ల కాలంలో విస్తరించబడతాయి. అట్టడుగు స్థాయిలో ఆరోగ్య వ్యవస్థను పటిష్టం చేయడానికి వీలు కల్పిస్తాయి.

భారత ప్రభుత్వం ప్రజలకు ఆరోగ్య సేవలను అందించడంలో అంతరాన్ని తగ్గించడంపై దృష్టి సారించే అనేక పథకాలను అమలు చేస్తుంది. ప్రధానమంత్రి- ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పీఎంఏబీహెచ్ఐఎం)ని గౌరవనీయులైన ప్రధానమంత్రి రూ. 64,180 కోట్లతో ప్రారంభించారు. ప్రధాన మంత్రి- ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పీఎంఏబీహెచ్ఐఎం) కింద చర్యలు ప్రస్తుత మరియు భవిష్యత్తులో వచ్చే మహమ్మారి/విపత్తులకు ప్రభావవంతంగా ప్రతిస్పందించడానికి ఆరోగ్య వ్యవస్థలను సిద్ధం చేయడానికి, ప్రాథమిక, ద్వితీయ మరియు తృతీయ అన్ని స్థాయిలలో నిరంతరాయంగా ఆరోగ్య వ్యవస్థలు మరియు సంరక్షణ సంస్థల సామర్థ్యాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాయి.

కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్ శుక్రవారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు




# మెగా మెడికల్ క్యాంపు.. ప్రారంభించిన కేశినేని చిన్ని..



న్యూఢిల్లీ, జులై 29: జిల్లా వ్యాప్తంగా ఎప్పటికీ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత కేసినేని ఫౌండేషన్ అధినేత కేసినేని శివనాద్ ఆధ్వర్యంలో మరో సేవా కార్యక్రమాన్ని నగరంలో నిర్వహించారు. కేశినేని చిన్ని ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు క్యాంపును శనివారం ఏర్పాటు చేశారు.

నగరంలోని వన్ టౌన్ చిట్టినగర్ మోతీ మసీద్ గ్రౌండ్ లో కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మెడికల్ క్యాంపుక్కు పెద్దఎత్తున హాజరైన వృద్ధులు, మహిళలు, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పలు విభాగాలకు చెందిన అత్యుత్తమ వైద్య నిపుణులు వీరికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంతకు ముందు ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు.

# మొహర్రం..హిందూ, ముస్లింల సాంస్కృతిక ఐక్యతకు చిహ్నం

జోగులాంబ గద్వాల జూలై 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);మొహర్రం.. హిందూ, ముస్లింల సాంస్కృతిక ఐక్యతకు చిహ్నం అని జోగులాంబ గద్వాల జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు తట్టే మహేష్ అన్నారు. మొహర్రం..పర్వదినం పురస్కరించుకొని ఆయన ముస్లిం సోదరులకు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మొహర్రం శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ త్యాగాలకు గుర్తుగా రాష్ట్రవ్యాప్తంగా హిందూ, ముస్లిం సోదరులు తరతరాలుగా మొహర్రం పండుగను నిర్వహిస్తున్నారన్నారు. ముస్లిం సోదరులు జరుపుకునే మొహర్రం త్యాగాలకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. నాటి కాలంలో ఇమామ్ హసన్, ఇమామ్ హుస్సేన్ సహా పలువురి త్యాగాలను స్మరించుకుంటూ మొహర్రం సాగుతుందన్నారు. త్యాగాలకు గుర్తుగా రాష్ట్రవ్యాప్తంగా హిందూ, ముస్లిం సోదరులు తరతరాలుగా మొహర్రం పండుగను నిర్వహిస్తున్నారని తట్టే మహేష్ గుర్తు చేశారు. పీర్ల పండుగ పేరుతో తెలంగాణలో హిందూ, ముస్లింల సాంస్కృతిక ఐక్యతకు చిహ్నంగా మొహర్రం నిలిచిందన్నారు. హిందువులు హసన్, హుస్సేన్‌లను ఆశన్న, ఊశన్నలనే పేర్లతో పీరీలను ఎత్తుకొని పాటలు పాడుకుంటూ, నాటి వారి త్యాగాలను పేరుపేరునా కీర్తిస్తూ, త్యాగానికి చిహ్నంగా నిప్పుల గుండాలపై నడుస్తారని తెలిపారు. గంగా జమున తెహజీబ్‌కు ప్రతీకగా నిలిచి, దేశానికే ఆదర్శంగా లౌకికవాద స్ఫూర్తిని మొహర్రం నింపుతున్నదన్నారు..

# నిరాశ్రయులకు రెడ్ క్రాస్ చేయూత



నిజామాబాద్, జులై 29:నిరాశ్రయులైన కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బుస్స ఆంజనేయులు అన్నారు. నిజామాబాద్ జిల్లాలోని గూపన్ పల్లి వాగు పొంగి నిరాశ్రయులైన 60 కుటుంబాలకు వర్ష బాధితులకి రెడ్ క్రాస్ ద్వారా దుప్పట్లు పంపిణీ చేశారు. రెడ్ క్రాస్ సభ్యులు సొంత విరాళాలతో దుప్పట్లు రెడ్ క్రాస్ నిజామాబాద్ జిల్లా శాఖ ద్వారా పంపిణీ చేసారు.

ఈ సందర్భంగా రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ బున్స ఆంజనేయులు మాట్లాడుతూ? జిల్లాలోని వర్ష బాధితులకు మండల కమిటీల ద్వారా పాక్షికంగా లేదా పూర్తిగా ఇల్లు దెబ్బతిన్న వారికీ తాటి పత్రిలు ఇస్తామన్నారు. పేదలకు సేవ చేయడమే రెడ్ క్రాస్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాదు రూరల్ ఎం.ఆర్.ఓ అనిల్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, కోశాధికారి కరిపే రవీందర్, కార్యదర్శి అరుణ్ బాబు, ఈ.సి సభ్యుడు వెంకట కృష్ణ, రూరల్ చైర్మన్ నర్సింహం, వైస్ చైర్మన్ నాగభూషణం, గూపన్ పల్లి కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, పి.ఆర్.ఓ బొద్దుల రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# న్యూఢిల్లీలో భారత్ మరియు మలేషియా మధ్య సైనిక సహకారంపై 10వ సబ్ కమిటీ సమావేశం

న్యూఢిల్లీ, జులై 29:భారతదేశం మరియు మలేషియా మధ్య సైనిక సహకారంపై జులై 27, 2023న న్యూఢిల్లీలో 10వ సబ్ కమిటీ యొక్క సమావేశం జరిగింది. భారత ప్రతినిధి బృందానికి రక్షణ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ (అంతర్జాతీయ సహకారం శ్రీ అమితాబ్ ప్రసాద్ నాయకత్వం వహించగా, అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్, డిఫెన్స్ ఆపరేషన్స్ అండ్ ట్రైనింగ్ డివిజన్ మేజర్ జనరల్ డాటో ఖైరుల్ అనూర్ బిన్ అబ్ద్ అజీజ్ మలేషియా పక్షం నేతృత్వం వహించింది.

ఈ సమావేశంలో ఇరుదేశాల మధ్య ప్రస్తుతం ఉన్న రక్షణ సహకారాన్ని సమీక్షించడంతోపాటు పరస్పర ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై విస్తృత చర్చలు జరిగాయి. ద్వైపాక్షిక రక్షణ చర్యలను మరింత విస్తరించేందుకు ఇరుపక్షాలు సమర్థవంతమైన మరియు ఆచరణాత్మక కార్యక్రమాల గురించి అన్వేషించాయి. నౌకానిర్మాణం మరియు నిర్వహణ ప్రణాళికలలో మలేషియా సాయుధ దళాలతో సహకరించే సామర్థ్యంతో భారత రక్షణ పరిశ్రమ సామర్థ్యాన్ని భారతదేశం నొక్కిచెప్పింది. ఈ ఏడాది సెప్టెంబరులో భారతదేశంలో డిఫెన్స్ సెక్రటరీ స్థాయిలో జరగనున్న 12వ మలేషియా-ఇండియా డిఫెన్స్ కోఆపరేషన్ కమిటీ (మిడ్‌కామ్) సమావేశానికి సాధ్యమయ్యే ఫలితాలపై కూడా ఇరుదేశాల సహాధ్యక్షులు చర్చించారు.

పరస్పర విశ్వాసం మరియు అవగాహన, ఉమ్మడి ఆసక్తులు మరియు ప్రజాస్వామ్యం మరియు చట్ట నియమాల భాగస్వామ్య విలువల ఆధారంగా మెరుగైన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పూర్తిగా అమలు చేయడానికి ఇరుపక్షాలు తమ నిబద్ధతను పునరుద్ఘాటించాయి. 2015లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మలేషియా పర్యటన సందర్భంగా మెరుగైన వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పడింది.

# ప్రెస్ క్లబ్‌లో మారుతి సాగర్ జన్మదిన వేడుకలు

## -కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న జర్నలిస్టులు



రాజన్న సిరిసిల్ల, జులై 29:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కానీ మారుతి సాగర్ జన్మదిన వేడుకలు వేములవాడ ప్రెస్ క్లబ్ లో శనివారం ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకను పురస్కరించుకొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం పక్షాన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న మారుతి సాగర్ సేవలను కొనియాడారు. తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టు అనే నినాదంతో తెలంగాణ జర్నలిస్టులను మమేకం చేసిన ప్రస్తుత మీడియా అకాడమీ చైర్మన్, రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ సారథ్యంలో చురుకైన ఉద్యమకారుడిగా గుర్తింపు పొందారు. కార్యక్రమం లో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొలిపాక నరసయ్య, సీనియర్ పాత్రికేయులు తాహేర్ పాషా, కొత్వాల్ శ్రీనివాస్, బుర్ర సందీప్, గంగాధర్, ప్రదీప్, బాలాజీ, సిహెచ్ నవీన్, శ్రీకాంత్, రాజు,దేవ రాజు తదితరులు పాల్గొన్నారు.

# టపాసుల గోదాములో భారీ పేలుడు.. ఎనిమిది మంది దుర్మరణం

చెన్నై జూలై 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తమిళనాడులో పెను విషాదం చోటుచేసుకుంది. కృష్ణగిరి జిల్లా పాళయపేట ప్రాంతంలోని టపాసుల గోదాములో శనివారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఎనిమిది మంది దుర్మరణంపాలు కాగా, 12 మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రులను హుటాహుటిన కృష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందంటున్నారు.కాగా, ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే గోదాం పూర్తిగా దగ్ధం కాగా, గోదాం సమీపంలోని మూడు ఇళ్లు కుప్పకూలాయి. శిథిలాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ఫ్యాక్టరీ రవి అనే వ్యక్తికి చెందినదిగా గుర్తించినట్టు కృష్ణగిరి ఎస్పీ సరోజ్ కుమార్ ఠాకూర్ తెలిపారు. కాగా, ప్రమాద కారణాలు కానీ, ఏ మేరకు ఆస్తినష్టం జరిగిందనేది తెలియాల్సి ఉంది. మృతుల కుటుంబాల రోదనలతో ఆ ప్రాంతంలో విషాదం అలముకుంది.

# తెలంగాణ డ్వాక్రా సంఘాల పనితీరు అద్భుతం : మంత్రి ఎర్రబెల్లి ప్రశంస



వరంగల్, జులై 29: తెలంగాణ మహిళా డ్వాక్రా సంఘాల పనితీరు, అనుభవాన్ని ఇతర రాష్ట్రాల మహిళ సంఘాలకు శిక్షణ ఇచ్చి తీరు అద్భుతంగా ఉందని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశంసించారు. ఇటీవల లడక్ వెళ్లి అక్కడ శిక్షణ ముగించి వచ్చిన హనుమకొండకు చెందిన పేదరిక నిర్మూలన సంస్థ ఓరుగల్లు మహా సమాఖ్యకు చెందిన 15 మంది మహిళలు శనివారం హనుమకొండలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు.

అక్కడి శిక్షణ ఇచ్చిన తీరును వివరించగా శభాష్ అంటూ వారిని మెచ్చుకున్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన మహిళలకు అభినందనలు తెలిపారు. ఏండ్లుగా వారు నిర్వహిస్తున్న శిక్షణ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందిన 10 ఉత్తమ ప్రగతి సాధించిన ఆదర్శ సంఘాలతో కలిపి ఓరుగల్లు పరస్పర సహాయక సహకార సంఘాలు మహా సమాఖ్యగా ఏర్పడి 18 ఏండ్లుగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంది.గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాదుల ఏర్పాటు ద్వారా పేదరిక నిర్మూలన, మహిళల ఆర్థికాభి వృద్ధికి చేస్తున్న కృషిని వివరించారు. 2015 లో ఈ సమాఖ్య తెలంగాణలో ఏకైక జాతీయ స్థాయి మానవ వనరుల సంస్థగా జాతీయ గుర్తింపును పొందింది. ఈ సంస్థలోని దాదాపు 460 మంది రిసోర్స్ పర్సన్స్ తగు శిక్షణ పొంది, దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తమ అనుభవాలను రంగరించి శిక్షణ ఇస్తున్నారు.అనంతరం మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలను సీఎం కేసీఆర్ బలోపేతం చేశారని వెల్లడించారు. పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో 4,35, 364 స్వయం సహాయక సంఘాలలో 45,60,518 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారన్నారు. దేశంలోనే ఇంత పెద్ద ఎత్తున సంఘటితమైన మహిళలు తెలంగాణలో తప్ప ఎక్కడా లేరన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జడ్పీ ఇన్‌చార్జి సీఈవో, వరంగల్ డీఆర్‌డీవో సంపత్ రావు, సెర్ప్‌నకు చెందిన తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, ఓరుగల్లు మహా సమాఖ్య కు చెందిన మహిళలు, రిసోర్స్ పర్సన్స్, సీనియర్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి పువ్వాడ ఏరియల్ సర్వే..

## - చర్లలోని పునరావాస కేంద్రంకు వెళ్లిబాధితులను కలిసి వారితోమాట్లాడారు




భద్రాద్రి కొత్తగూడెం, జూలై 29 (నేటినిజం ప్రతినిధి) :ఎగువన ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు భద్రాచలం వద్ద గోదావరి ఉదృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో గోదావరి చుట్టుపక్కల పోటెత్తిన వరదల కారణంగా పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. తద్వారా గోదావరి పరివాహక ప్రాంతాల్లో పోటెత్తిన వరదల నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు గోదావరి పరివాహక ప్రాంతాల్లో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించారు. ఏరియల్ సర్వే భద్రాచలం నుండి చర్ల వరకున్న గోదావరి పరివాహక ప్రాంతంలో కొనసాగింది. చర్ల గ్రామంలో దిగి అక్కడ గోదావరి ప్రవాహాన్ని పరిశీలించి లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం జీపీ పల్లి లో గల పునరావాస కేంద్రంలో బాధితులను కలిసి వారితో మాట్లాడి, అక్కడ అందుతున్న సౌకర్యాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వేలో భాగంగా గోదావరి పరివాహక ప్రాంతాలో జరుగుతున్న సహాయక కార్యక్రమాలను మంత్రి పువ్వాడ నేరుగా పర్యవేక్షించారు. ప్రస్తుతానికి ఎలాంటి ప్రమాదం లేదని, క్రమంగా తగ్గుముఖం పడుతున్నదని ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదనిన్నారు.

# హైదరాబాద్‌లో రాబోయే రెండు రోజుల్లో పెరగనున్న పగటి ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, జులై 29:గత వారం రోజుల నుంచి హైదరాబాద్ నగర వ్యాప్తంగా కుండపోత వర్షాలు కురిసిన సంగతి తెలిసిందే. దీంతో నగరమంతా చల్లని వాతావరణం ఏర్పడింది. కానీ రాబోయే రెండు రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. శనివారం పలు ప్రాంతాల్లో ఉక్కపోత సంభవించింది.రాబోయే రెండు రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకునే అవకా శం ఉందని పేర్కొంది. ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని తెలిపింది. దీంతో కాస్త ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగే అవకాశం ఉంది. కనిష్టంగా 22 నుంచి 23 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది.శనివారం నగరంలో పలు ప్రాంతాల్లో వాన కురిసింది. ఉప్పల్‌లోని రాజీవ్ నగర్ కమ్యూనిటీ హాల్ పరిసరాల్లో 4.3 మి.మీ., మౌలాలిలో 3 మి.మీ., జీడిమెట్లలో 2.3 మి.మీ. వర్షపాతం నమోదైంది.

# ములుగు జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి సత్యవతి రాథోడ్ క్షేత్రస్థాయి పరిశీలన

## -ములుగు జిల్లాలో మంత్రి ఆదేశాలతో యుద్ధ ప్రతి ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు
## -లోతట్టు ప్రాంతాల్లో నివాసముట్టున్న ప్రజలను పరామర్శ



ములుగు , జులై 29: (నేటినిజం ప్రతినిధి): వరద బాధితులను అన్ని రకాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర మహిళా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు.

శనివారం గోవిందరావు పేట, ఏటూరు నాగారం మండలంల లోపర్యటించి, గత వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాల వల్ల జిల్లాలో అత్యధిక వర్షాపాతం నమోదు అయిందని తెలిపారు.

గుండ్ల వాగు ప్రాజెక్ట్, దయ్యాలవాగు జంపన్న వాగు, ప్రవాహం వలన కొండాయి గ్రామం పూర్తిగా దెబ్బతిందని, 8 మంది చనిపోయారని , ఔఆఖీఈ బృందాలు 55 మందిని రక్షించాయని,

ఆస్తి నష్టం, పంట నష్టాలను అంచనా వేసి తక్షణమే ప్రభుత్వ సహాయం అందిస్తామని తెలిపారు. అదేవిధంగా గోదావరి నదిలో 14 లక్షల 80 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుందని ,2 వ ప్రమాద హెచ్చరిక జారీ చేశామని, ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకి రాకూడదని తెలియజేశారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రత్యేకంగా హెలికాప్టఆర్ ద్వారా ఆహారం, మంచినీరు, మందులు ,ఇతరత్రా వస్తువులను అందించామని తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా వరదలలో 12 మంది చనిపోయారని ,ఇది అత్యంత బాధాకర విషయం అని, రాష్ట్ర ప్రభుత్వం వారి కుటుంబాలకుఅండగా ఉంటుందనీ, తక్షణమే ప్రభుత్వం తరఫున సాయం అందిస్తుందని తెలిపారు.

సంవత్సరం సగటున పడవలసిన వర్షం ఒకేరోజు కుంభవృష్టి కురవడం వలన ఇలాంటి నష్టం వాటిల్లిందని తెలియజేస్తూ, వరద ప్రాంతాలలో దెబ్బతినటువంటి రోడ్లకు మరమ్మత్తులకు తక్షణమే నివేదిక పంపించి అత్యంత వేగంగా వాటిని సరిచేయాలని తెలియజేశారు. వరద ముప్పుకు గురైన అన్ని గ్రామాలలో కరెంటు, మంచినీటి సౌకర్యం, శానిటేషన్, మరియు హెల్త్ కాంప్లెను ఏర్పాటు చేశామని తెలియజేశారు. ప్రజలు ప్రజాప్రతినిధులు అందరు కూడా వీలైనంతవరకు వరద ముంపు బాధితులకు సహాయం అందించాలని కోరారు .

ఈ కార్యక్రమంలో జడ్పి చైర్ పర్సన్ బడే నాగజ్యోతి, ఖీఇఆఅూ చైర్మన్ సతీష్ రెడ్డి, జిల్లా ఇంఛార్జి ప్రత్యేక అధికారి యస్. క్రిష్ణ ఆదిత్య, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,ఎస్పీ గౌస్ ఆలామ్, ఐటిడిఏ పి ఓ అంకిత్, గ్రంథాలయ చైర్మన్ గోవింద్ నాయక్, ఇతర అధికారులు, పాల్గొన్నారు

# త్యాగాలకు ప్రతీక మొహర్రం పండుగ

## -బీఆర్ఎస్ మండల యూత్ నేత మైలారం రాము



రాజన్న సిరిసిల్ల, జులై 29:(నేటినిజం ప్రతినిధి): త్యాగాలకు ప్రతీక మొహర్రం పండుగని బీఆర్ఎస్ మండల యూత్ నేత, రజక సంఘం అధికార ప్రతినిధి మైలారం రాము అన్నారు.మొహర్రం మోసాన్ని పురస్కరించుకుని శనివారంవేములవాడ అర్బన్ మండలం మారుపాక పీరీల మసీద్ లో ఏర్పాటు చేసిన పీర్లను మైలారం రాము దర్శించుకుని,ఊదు, బెల్లం సమర్పించి ముక్కులు చెల్లించుకున్నారు.. మండలంలోని ప్రజలుప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయు ఆరోగ్యాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నట్లు రాము తెలిపారు..కులాలకు అతీతంగా గ్రామ, గ్రామలల్లో పీర్ల పండుగ ఘనంగా జరుపుకుంటామని,కుల ,మత తేడా లేకుండా పీర్లను పూజిస్తారని, ప్రతి సంవత్సరం ఈ పండుగను ఘనంగా నిర్వహించుకుంటామన్నారు. వారి తోపాటుగా బిఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు





విశాలాక్షి సాహిత్య మాస పత్రిక
మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ - విజయవాడ
సంయుక్త ఆధ్వర్యంలో కథల పోటీ

తెలుగు కథ ఔన్నత్యాన్ని చాటి చెబుతూ విలువలకు ప్రతీకగా నిలిచే తెలుగు కథలను ఆహ్వానిస్తున్నాము. సహృదయ తెలుగు కథకులందరికీ మా స్వాగతం.

బహుమతుల వివరాలు

ప్రథమ బహుమతి రూ. 6000/-
ద్వితీయ బహుమతి రూ. 5000/-
తృతీయ బహుమతి రూ. 4000/-
ప్రత్యేక బహుమతులు రూ. 7000/- (ఒక్కో కథకు రూ. 1000/-లు చొప్పున 7 కథలకు)

- కొత్త కథ కావాలి, పాత కథలు, తిరిగి వచ్చినవి వద్దు
- డిటిపిలో 4 పేజీలు, చేతివ్రాతలో 7 పేజీలు మించరాదు
- రచనలు నేరుగా క్రింది చిరునామాకు పంపాలి మెయిల్, వాట్సప్‌లకు అనుమతి లేదు
- హామీ పత్రంలోనే మీ వివరాలు రాయాలి. కథ మీద రాయకండి.
- ఒకరు ఒక కథ మాత్రమే పంపాలి.
- విశాలాక్షి ద్విదశాబ్ది ఉత్సవాల్లో విజేతలకు బహుమతులతో పాటు జ్ఞాపికలతో సత్కారం
- మరింత సమాచారం కోసం సం॥ 800 856 2742 వాట్సప్ మెసేజ్ మాత్రమే.

కథలు చేరవలసిన చివరి తేది 19-08-2023

రచనలు పంపవలసిన చిరునామా
VISALAKSHI MASA PATHRIKA
D.No. 27-5-487, Padmavathi Nagar,
Balaji Nagar Ext,Nellore - 524002.
Cell : 800 856 2742


# ఘనంగా డాక్టర్ సి.నారాయణ రెడ్డి 92వ జయంతి వేడుకలు



రాజన్న సిరిసిల్ల, జులై 29:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ నృత్యకళానికేతన్ సేవాసంస్థ, జిల్లా సాంస్కృతిక కళా సంస్థల సమాఖ్య ప్రధానకార్యాలయంలోశనివారం డా.సినారె 92వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ముందుగా కళాకారులందరూ జ్ఞానపీఠపురస్కార గ్రహీత డా. సి నారాయణరెడ్డి చిత్రపటానికి పుష్పాంజలితో ఘన నివాళులు అర్పించారు. ఇందులో భాగంగా కళాక రులు డా. సినారె రాసిన గేయాలను ఆలపించారు. అనంతరం కళాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు యెల్ల పోశెట్టి మాట్లాడుతూ హనుమాజీపేట ముద్దుబిడ్డ జ్ఞానపీఠపురస్కార గ్రహీత, మాజీ రాజ్యసభ సభ్యులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షులు, వేములవాడనృత్య కళానికేతన్ సేవాసంస్థ ముఖ్య సలహాదారులు డాక్టర్ సి నారాయణరెడ్డి 92వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. సినారె రాసిన సినీపాటలను లలితగేయాలను, జానపద గీతాలను, ఆయన పాడిన గజల్స్ ను ఇప్పటికీ వింటూనే ఉన్నామని గుర్తు చేశారు. హనుమాజీపేటలోని గ్రామ చివరన ఉన్న డా. సినారె విగ్రహాన్ని బస్టాండ్ ఆవరణలో నెలకొల్పుట కొరకు గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు,పుర ప్రముఖులు సహకరించగలరని కోరారు. అలాగే వేములవాడలోని సినారె కళామందిరం నందు డా. సినారె విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులను అధికారులను, కళాకారులను కోరారు. కార్యక్రమం అనంతరం మిఠాయిల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య గౌరవ అధ్యక్షులు బొద్దురాములు, సమాఖ్య అధ్యక్షులు సావనపల్లి శ్రీనివాస్, సేవాసంస్థ అధ్యక్షులు మానువాడ లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శులు వారాల దేవయ్య, వెంపటి సంతోష్ కుమార్, కనపర్తి హనుమాన్లు, గణాచారి సాంబశివు, కేశన్నగారి రాధిక శ్రీకాంత్, ముత్తోజు రమేష్ చారి, విక్కుర్తి లక్ష్మీనారాయణ, ప్రభుత్వ ఉపాధ్యాయులు, పులి సంపత్ గౌడ్, వెదిరెరవి, వెదిరెగణేష్ మిద్దె వినీత్, గుమ్మడి రాజేశం గౌడ్, అన్నారం హరీష్, కనికరపు అనిల్, మామిండ్ల సత్తయ్య కళాకారులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా మహమ్మద్ హయాజ్



రాజన్న సిరిసిల్ల, జులై 29:(నేటినిజం ప్రతినిధి): సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ గా మహమ్మద్ హయాజ్ నియమిస్తూప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కోరుట్ల మున్సిపల్ కమిషనర్ గా పనిచేస్తున్న మహమ్మద్ హయాజ్ కు గ్రేడ్ -1 కమిషనర్ గా పదోన్నతి కల్పిస్తూ సిరిసిల్ల లో పోస్టింగ్ ఇచ్చారు.ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

# సీఈఐఆర్‌తో పోయిన ఫోన్ సులభంగా కనుగొనవచ్చు

## -పట్టణ సీఐ పి కరుణాకర్
## -బాధిత వ్యక్తికి ఫోన్ అప్పగింత




రాజన్న సిరిసిల్ల, జులై 29:(నేటినిజం ప్రతినిధి): సీఈఐఆర్ తో పోయిన ఫోన్ సులభంగా కనుగొనవచ్చని వేములవాడ పట్టణ సీఐ పి కరుణాకర్ అన్నారు. ఈ సందర్భంగాసిరిసిల్లకు చెందిన గోవింద్ కిరణ్ రెడ్మి 9 పవర్ ఫోన్ పోగొట్టుకోగా, సీఈఐఆర్ తో ఫోన్ ను కనుగొని, బాధిత వ్యక్తికి శనివారం అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. ఫోన్ పోగొట్టుకున్న బాధితులు పోలీస్ స్టేషన్ లో దరఖాస్తు చేసుకొని, సీఈఐఆర్ సేవలు వినియోగించుకోవాలని సూచించారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com